ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం fb.com/vaartha

PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

28-10-2023 శనివారం సంపుటి : 29 సంచిక : 268 పేజీలు : 8+16 వెల : 6.50


రేషన్ పంపిణి స్కాంలో బెంగాల్ మంత్రి అరెస్టు

5లో

చైనా మాజీ ప్రధాని లీ కెకియాంగ్ మృతి



శుక్రవారం సూర్యాపేటలో జరిగిన బిజెపి జనగర్జన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, హాజరైన ప్రజానీకం



శుక్రవారం పాలేరు నియోజకవర్గంలోని జీళ్లచెరువులో జరిగిన జన ఆశీర్వాద సభలో సిఎం కెసిఆర్, హాజరైన అశేష జనసందోహం

# సిఎం బిసిలకే

**సూర్యాపేట బిజెపి జనగర్జన సభలో అమిత్‌షా**

## కుటుంబ పాలనను సాగనంపండి

## తెలంగాణ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

## బిఆర్ఎస్ వస్తే దళితుని సిఎం చేస్తారా?

**సూర్యాపేట, అక్టోబరు 27, ప్రభాతవార్త :** బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలది కుటుంబ పాలన. ప్రజా సంక్షేమం పట్టదు.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయరు .. రెండు పార్టీలు ఒకే తాను ముక్కలు. ఎన్నికల తరువాత కూడా కలిసే అవకాశం లేకపోలేదు. బిఆర్ఎస్ పాలనలో అవినీతి పెరిగి పోయింది. అనుకోని స్థాయికి అవినీతి పెరగడంతో అన్ని వర్గాల ప్రజలు బిఆర్ఎస్ పాలనపట్ల అసం తృప్తితోఉన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చినప్పుడు అభివృద్ధిని మర్చిపో ≫2

# రైతుబంధు ఆగదు..

## రూ. 16 వేలకు పెంచుతాం

## రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నా

## కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు కోతలు, వలసలే

## పాలేరు జన ఆశీర్వాద సభలో సిఎం కెసిఆర్

**ఖమ్మం, అక్టోబరు 27, ప్రభాతవార్త:** పొరపాటున రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రైతుబంధు పథకానికి రాం.. రాం. దళితబంధుకు జై భీమ్ పలుకుతారని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. రైతుబంధుపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, 24 గంటల విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరిని బయటపెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పాలేరు నియోజకవర్గంలోని జీళ్ళచెరువు గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రజా ఆశీర్వాద సభలో సిఎం కెసిఆర్ పాల్గొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుబంధు అమలు చేస్తుంటే ≫2

# ఒక్కరితో బిజెపి రెండో జాబితా

## మహబూబ్‌నగర్ నుంచి మిథున్ కుమార్ ఖరారు

**హైదరాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభ ఎన్నికలలో అభ్యర్థుల జాబితాపై బిజెపి తీవ్ర కసరత్తు చేస్తుంది. ఎన్నికల్లో గెలిచే విష యంలో అభ్యర్థుల విషయంలో అధిష్టానం ఆచి తూచి వ్యవహరిస్తుంది. అందులో భాగంగానే మొదటి విడత 52 మందితో కూడిన జాబితాను విడుదల చేయగా, శుక్రవారం ≫2

# 45 మందితో కాంగ్రెస్ రెండో జాబితా



తుమ్మల నాగేశ్వరరావు



రాజగోపాల్ రెడ్డి



కొండా సురేఖ



పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## తుమ్మల, రాజగోపాల్, పొంగులేటి, పొన్నం, కొండా సురేఖ, జువ్వాడ, లక్ష్మారెడ్డి, మల్‌రెడ్డి సహా పలువురు సీనియర్లు బరిలోకి

## బిసిలకు మొండిచేయి, అనిశ్చితిలో వామపక్షాలు

## బిఆర్ఎస్ సీనియర్లకు పోటీగా బలమైన అభ్యర్థులు

**హైదారాబాద్, అక్టోబరు 27,ప్రభాతవార్త :** తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా శుక్రవారంరాత్రి కాంగ్రెస్ హైకమాండ్ విడుదలచేసింది. అంతా వూహించి నట్లుగానే ఖమ్మం తుమ్మలనాగేశ్వరావుకు, పాలేరు పొంగులేటి శ్రీనివవాసరెడ్డికి, మునుగోడులో రాజగోపాల్ రెడ్డికి కంటోన్మెంట్‌లో గద్దర్ కూతురు వెన్నెలకు, పిజెఆర్ కూతరు విజయారెడ్డి ఖైరతాబాద్ సీటు కేటాయించారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటి తీవ్ర కసరత్తు చేసింది. వలసపక్షులు ≫2

# నేటి నుంచి మళ్లీ కాంగ్రెస్ బస్సు యాత్ర

## తాండూరు, పరిగి, చేవెళ్లలో డికె శివకుమార్ ప్రచారం

**హైదరాబాద్, అక్టోబరు 27,ప్రభాతవార్త:** విజయ భేరి బస్సుయాత్ర రెండో విడత శనివారం తాండూరు నుంచి తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటి చేపట్టనున్నది. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మొదటి రోజు బస్సుయాత్రలో పాల్గొం టారు. ఆరు రోజుల పాటు కొనసాగే ఈ యాత్రలో ఆదివారం రెండోరోజు మల్లికార్జునఖర్గే భాగస్వాము లవుతారు. ప్రియాంకవధేరా, రాహుల్‌గాంధీ కూడా ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి ≫2







625L వరకు బూట్ స్పేస్



20.32 cm టచ్ స్క్రీన్ mediaNAV ఇవాల్యుయేషన్



ఫ్రంట్ మరియు సైడ్ ఎయిర్‌బ్యాగ్స్- డ్రైవర్ మరియు పాసెంజర్



హిల్ స్టార్ట్ అసిస్ట్ (HSA)

for a test drive, call on 1800 315 4444. select variants available in CSD. special offers for defence personnel, government, PSU and corporate employees. for bulk enquiries, contact corpsales@renault.com

for further details, connect on renault.co.in

terms and conditions apply. *₹7 999 EMI based on a loan amount of ₹4.74 lakh for a tenure of 84 months. EMI may vary based on actual loan amount and tenure. not valid for any added loan amount and tenure. finance at the sole discretion of Renault Finance. #advantages up to ₹50 000/- for Triber includes cash benefits up to ₹20 000/- on select variants, exchange benefits up to ₹20 000/- on select variants & loyalty cash benefits up to ₹10 000/- on select versions. *Triber has scored 4-star safety rating for adult occupant safety and 3-star child occupant safety in crash test conducted by Global NCAP. the same has been published by NCAP on their website. the evaluation of the tests by Global NCAP has resulted in Triber being the safest in the 7-seater mass segment in India.corporate/PSU/defense personnel/government employee/professionals benefits applicable on each model is basis eligibility of the customer and based on submission of required proof by the customer. price valid on the date of purchase. for detailed offers, visit www.renault.co.in/offers. Renault India Pvt. Ltd. reserves the right at its absolute discretion to terminate this scheme or vary, delete or add to any of these terms and conditions from time to time without notice including without limitation. offers may vary across variants and cities. model/accessories shown may not be a part of the standard fitment. the color in the image may vary slightly from the actual color of the product. the above mentioned offers & benefits are valid till 31st October 2023 and are through Renault dealership. Renault India Pvt. Ltd. shall not be liable for any loss or damage arising from your failure to comply or understand the offer details. in the event of any dispute, all matters shall be governed by all applicable laws of India and court at Gurugram shall have the exclusive jurisdiction. for detailed terms and conditions, please visit www.renault.co.in

**SHOWROOMS: TELANGANA: KHAMMAM**: RENAULT Khammam Mob: +91 8527234093, **SATHUPALLY:** RENAULT Sathupally Mob: +91 8130499615. **KOTHAGUDEM:** RENAULT Kothagudem Mob: +91 7428439271. **MAHABUBABAD:** RENAULT Mahabubabad Mob: +91 9311341235.

## అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు

### దాడులను వామపక్షాల ఖండన

### 31న మద్దతుగా సంఘీభావ సభ

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** అగ్ర రాజ్యమైన అమెరికా అండతోనే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని వామపక్షాలు విమర్శించాయి. పాలస్తీనాపై దాడులను వామ పక్షాలు ఖండించాయి. పాలస్తీనాకు సంఘీ భావంగా ఈనెల 31న హైదరాబాద్‌లో సంఘీ భావ సభను అనంతరం ప్రదర్శనను నిర్వహించ నున్నట్టు వాపమపక్ష పార్టీలు ప్రకటించాయి. తెలంగాణ వామపక్ష పార్టీల సమావేశం శుక్రవారం సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో జరిగింది. సమావేశంలో సీపీఎం నుంచి డీజీ నర్సింహారావు, సీపీఐ నుంచి బాలమల్లేష్, ప్రజాపంథా నుంచి హన్మేష్, న్యూడెమోక్రసీ పార్టీ నుంచి ఎన్ శ్రీనివాస్, ఎంసీపీయూఐ నుంచి జి రవి, ఎస్‌యూసీఐ నుంచి మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బి ప్రసాద్, ఆర్ఎస్‌పీ నుంచి జానకి రాములు, లిబరేషన్ నుంచి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. పశ్చిమదేశాల అండతో ఇజ్రాయిల్ అక్టోబర్ 7 నుంచి పాలస్తీనాపై దాడులు ప్రారంభించిందని సమావేశంలో పాల్గొన్న నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దాడులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అమెరికా తన వీటో పవర్‌ను ఉపయోగిస్తూ, కుట్రలకు తెగబడిందన్నారు. వేలాదిమంది పాలస్తీనియన్లను హత్య చేసింది సమావేశం మండిపడింది. పాఠశాలలు, ఆసుపత్రులపై సైతం దాడులు చేస్తుందని మండిపడ్డారు. చివరికి ఆహారం, తాగునీరు, అందకుండా చేయడమే కాకుండా ఇతర దేశాలు పాలస్తీనాకు పంపుతున్న సహాయాన్ని కూడా అందకుండా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 3వేల మంది చిన్నారులుసహా 7వేల మంది మరణించారని.. 10వేలకుపైగా గాయాలపాల య్యారని వారు తెలిపారు. లక్షలాది మంది శరణార్థులుగా మారారని.. ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ఈ యుద్ధాన్ని ఖండిస్తున్నాయని అన్నారు.

# దేశ ప్రతిష్ఠ పరిరక్షణలో పోలీసు వ్యవస్థ కీలకం

● దేశ అభ్యున్నతి కోసం ఐపిఎస్‌లు కృషి చేయాలి ● ఐపిఎస్‌ల దీక్షాంత్ పెరేడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయిపటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శుక్రవారం జరిగిన 75వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారుల దీక్షాంత్ పెరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్ర హోమ్‌మంత్రి అమిత్‌షా

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** దేశ ప్రతిష్టలు కాపాడడంలో పోలీసు వ్యవస్థది కీలక పాత్ర అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, ఉగ్రవాదులు, తీవ్రవాదుల పీచమణ చడంలో పోలీ సుల పాత్ర ఎనలేనిదని ఆయన తెలిపారు. ఇందులోనే దేశ ప్రతిష్టలు ముడిపడి వున్నాయ ని ఆయన వెల్లడించారు. నగర శివార్లలోని శివరాంపల్లిలో గల సర్దార్ వల్లభభాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శుక్రవారం జరిగిన 75వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారుల దీక్షాంత్ పెరేడ్‌కు అమిత్‌షా ముఖ్యఅతిథిగా విచ్చేసి వారి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం అత్యున్నత ఒగా వుండేందుకు ఐపిఎస్‌లు పాటుపడాలని కోరారు. సామాన్యులు, పీడిత ప్రజల అభ్యున్నతి వారి భద్రత కోసం ఐపిఎస్‌లు మరింత నిబద్ధతో కృషి చేయాలని హోం మంత్రి సూచించారు. సైబర్ నేరాల నివారణలో టెక్నాలజిని మరింత వాడుకోవాలని ఆయన కోరారు. నక్సలిజం, టెర్రరిజంను అంతమొందించడంలో ఐపిఎస్ అధికా రులు ఇప్పటికే సుక్షితులయ్యారని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేం దుకు ఇప్పటి నుంచే సిద్దం కావాలని ఆయన సూచించారు.

ముఖ్యంగా వ్యవస్థీకృత నేరాలు పోలీసులకు సవాళ్లు విసురుతున్నాయని, వీటి నివారణలో పోలీసులు మరింత రాటుదేలాల్సిన అవసరం వుందని అమిత్ షా చెప్పారు. దేశ ఆ ర్థిక వ్యవస్థకు ఇబ్బందిగా మారిన క్రిప్టో కరెన్సీ విషయంలో మరింత పరిణతి సాధించాలని ఆయన కోరారు. హవాలా నగదు చలామణి, నకిలీ నోట్ల చలామణి, మాద కద్రవ్యాల స్మగ్లింగ్ విషయంలో పోలీసులు మరింత గా పురోగతి సాధించాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా క్రిప్టో కరెన్సీ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనం చేసేందుకు కొందరు వ్యవస్థీకృత నేరగాళ్ల ప్రయత్నాలు చేస్తున్నారని, వీటిని మొగ్గలోనే తుంచి వేయాలని ఆయన సూచించారు. న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా క్రిమినల్ జస్టిస్ విషయంలో ఐపిఎస్‌లు పట్టు సాధించాలని అమిత్ షా కోరారు. బ్రిటీష్ కాలం నాటి ఐపిఎస్, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ చట్టాలను మార్చేందుకు కేంద్రం కంకణం కట్టుకుందని, ఇందుకోసం పార్లమెంట్‌లో చట్టం తేనున్నామని ఆయన తెలిపారు. కొత్త చట్టాలు త్వరలోనే అమల్లోకి వస్తాయని ఆయన అన్నారు. శాసనాలను సురక్షితంగా వుంచడమే పాత చట్టాల ఉద్దేశంగా వుండేదని, అయితే ప్రజల హక్కులను సురక్షితంగా వుంచడం కోసం కొత్త చట్టాలను తెస్తున్నామని ఆయన వెల్లడించారు. కర్తవ్య నిర్వహణలో అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలని అమిత్ షా అన్నారు. పోలీసు శాఖతో పాటు అనేక రంగాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. దేశాన్ని ఐక్యంగా వుంచేందుకు నాడు సర్దార్ వల్లభ భాయి పటేల్ తొలి కేంద్ర హోంమంత్రిగా చేసిన సేవల ను ఆయన ఈ సందర్భంగా ప్రస్తుతించారు. అప్పట్లో సర్దార్‌పటేల్ చేసిన అవిరళ కృషి వల్లే నేడు భారతదేశం ఉన్నతంగా వుందని ఆయన కొనియాడారు. సర్దార్ పటేల్ పేరిట ఏర్పాటైన ఐపిఎస్ అధికారుల శిక్షణా కేంద్రం నేడు దేశానికే తల మానికంగా వుందని ఆయన తెలిపారు. 175 మంది అధికారులు పాల్గొన్న ఈ దీక్షాంత్ పెరేడ్‌లో 155 మంది ఐపిఎస్ అధికారులు కాగా 20 మంది విదేశీ అధికారులున్నారు. వీరిలో 34 మంది మహిళలు వున్నారు. దీక్షాంత్ పరేడ్‌కు మహారాష్ట్ర కేడర్‌కు చెందిన అనుష్కా కాలియా నాయకత్వం వహించారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన పరేడ్ కమాండర్ అనుష్కా కాలియాకు బెస్ట్ క్యాడర్ అవార్డుతో పాటు కత్తిని బహుకరించారు. ఆమెతో పాటు శిక్షణలో ప్రతిభ కనబరచిని మరికొందరు ఐపిఎస్ అధికారు లకు కేంద్ర హోం మంత్రి ట్రోపిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిజిపి అంజనీ కుమార్‌తో పాటు సిబిఐ, ఐబి డైరక్టర్లు, త్రివిద దళాలకు చెందిన అధిపతులు, విశ్రాంత పోలీసు, రక్షణ బలగాల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ఐపిఎస్‌ల దీక్షాంత్ పెరేడ్ ఆహూతులను అలరించింది.

## బిఎస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాల్లో నిబంధనలు సడలించాలి

### ప్రభుత్వానికి విద్యార్థుల విజ్ఞప్తి

### ఎంసెట్‌లో క్వాలిఫై అయిన వారందరికీ సీట్లివ్వాలి

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీఎస్‌సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించిన నిబంధనలను సడలించాలని, మిగిలిన సీట్లను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని బీఎస్‌సీ నర్సింగ్ విద్యార్థులు ప్రభుత్వానికి, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో బీఎస్‌సీ కోర్సును నిర్వహించే కాలేజీలు 102 ఉన్నాయని.. వాటిల్లో 6500 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు 3000 సీట్లను మాత్రమే భర్తీ చేశారని.. మరో 3500 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే రెండు విడతల్లో వెబ్ కౌన్సెలింగ్ పూర్తయిందని విద్యార్థులు తెలిపారు. బీఎస్‌సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబర్ 31 తుది గడువుగా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ స్పష్టం చేసిందని విద్యార్థులు గుర్తు చేశారు. గత ఏడాది వరకు ఇంటర్మీడియట్‌లోని బైపీసీ గ్రూపులో వచ్చిన మార్కుల ఆధారంగా నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలను చేపట్టే వారని.. కానీ ఈ ఏడాది నుంచి ఎంసెట్‌లో 63000 ర్యాంక్‌ల వరకు వచ్చిన వారికి మాత్రమే నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశమిచ్చారని విద్యార్థులు చెబుతున్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో నీట్ ర్యాంక్‌ను పరిగణిస్తున్నారని..ఇది ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా జరుగుతోందని విద్యార్థులు తెలిపారు. బీఎస్‌సీ నర్సింగ్ కోర్సులో చదివే విద్యార్థులు పేద, బడుగు, బలహీన, ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారని.. వారికి ఎంసెట్‌కు శిక్షణ పొందే అవకాశం, వనరులు, సమాచారం ఉండదని విద్యార్థులంటున్నారు. వారికి ఎంసెట్‌లో ర్యాంకులు రావడం కష్టమని.. ఈ నేపథ్యంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో బీఎస్‌సీ నిర్సింగ్ కోర్సులకు నిబంధనల్లో సడలించాయని, ఎంసెట్, నీట్ పరీక్షల్లో క్వాలిఫై అయిన వారికి ప్రవేశాలు ఇచ్చారని.. అలాగే ఇక్కడ కూడా నిబంధనల్లో సడలింపులు ఇచ్చి విద్యార్థులు బీఎస్‌సీ కోర్సులో చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మళ్లీ ఉల్లి లొల్లి

### కిలో రూ.50కి పెరిగిన ధరలు

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణలో మళ్లీ ఉల్లి లొల్లి మొదలైంది. మొన్నటి వరకూ సామాన్యులను టమాటా, మిర్చి తదితర కూరగాయల ధరలు తీవ్ర ఇబ్బంది పెట్టగా, ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా అదుపులోకి వస్తున్నాయి. వీటి నుండి ఒకింత తేరుకునేలోపుగానే మళ్లీ ఉల్లి లొల్లి షురూ అయింది. రాష్ట్రంలో వారం రోజులుగా ఉల్లి ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. అగస్టులో 100 రూపాయలకు 6 కేజీలు, కొన్ని చోట్ల 7 కేజీలు ఇవ్వగా, సెప్టెంబరు నెలకు వచ్చేసరికి 4 కేజీలకు చేరింది. ఇక ఇప్పుడు ఉల్లి ధర కిలో 50 రూపాయల వరకూ ఉంది. అగస్టు నెలలో కిలో 16 నుండి 18 రూపాయల వరకూ ఉన్న ధర ఇప్పుడు 50 రూపాయలకు చేరడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్‌కు 80 నుండి 100 లారీల ఉల్లి పంట రావాల్సి ఉండగా, ప్రస్తుతం 29 లారీల ఉల్లి మాత్రమే వచ్చాయని మలక్‌పేట్ మార్కెట్ కార్యదర్శి దామోదర్ తెలిపారు. కాగా వర్షాలు సరిగా లేకపోవడం వల్ల రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, చేవెళ్లలో ఉల్లి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందిన రైతులు చెబుతున్నారు. మరోవైపు హైదరాబాద్‌కు దిగుమతి అయ్యే మహారాష్ట్రలోనూ సాగు విస్తీర్ణం తగ్గడంతో ఉల్లి ధరలు పెరిగాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నవంబరు రెండో వారంలో స్థానికంగా ఖరీఫ్ పంట అందుబాటులోకి రానుండటంతో ఉల్లి ధరలు తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# టిజెఎస్‌కు కాంగ్రెస్ హ్యాండిచ్చినట్లేనా?

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేద్దామని ప్రతిపాదించిన టీజేఎస్‌కు కాంగ్రెస్ పార్టీ హ్యాండిచ్చినట్లే కనిపిస్తోంది. చేతి గుర్తుపైనే పోటీ చేస్తాం...మా పార్టీకి ఆరు సీట్లు కేటాయించండి అని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ ఆ పార్టీ అధిష్టానానికి మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన కోదండరాం సూర్యాపేట, ముథోల్, ఎల్లారెడ్డి, నర్సంపేట, కోరుట్ల తదితర 12 సీట్ల జాబితాను ఇచ్చి వాటిలో ఆరు స్థానాలను టీజేఎస్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో ఈ స్థానాలలో పోటీ చేసే ఉద్దేశ్యంతో ఆ పార్టీ నేతలు

### సీట్ల కేటాయింపుపై ఇప్పటికీ తేల్చని అధిష్ఠానం

### చేతి గుర్తుపై పోటీ చేస్తామన్నప్పటికీ స్పందన కరవు

విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి టీజేఎస్ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న అన్ని పార్టీలనూ అధికార బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఏకం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఆ పార్టీని గద్దె దింపడం లక్ష్యంగా ఉమ్మడిగా పోటీ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గత కొద్ది రోజులుగా తమ వంతుగా ప్రచారం నిర్వహించారు. మరోవైపు, తాను ఎక్కడి నుంచీ పోటీలో ఉండబోననీ, ఎన్నికలలో కాంగ్రెస్, టీజేఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్రమంతా తిరిగి ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు.

మరోవైపు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతోనూ సమావేశమైన కోదండరాం ఇవే ప్రతిపాదనలను ఆయన ముందుంచారు. ఆ తరువాత రెండు పార్టీల మధ్య పొత్తు, సీట్ల కేటాయింపుపై ఏదో ఒకటి తేల్చాలని కాంగ్రెస్ పార్టీకి డెడ్‌లైన్ విధించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మల్లు రవి టీజేఎస్ కార్యాలయానికి వచ్చి కోదండరాంతో చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం కాంగ్రెస్ పార్టీ పొత్తులో భాగంగా టీజేఎస్‌కు కనీసం రెండు మూడైనా సీట్లను కేటాయిస్తూ ప్రకటన చేస్తుందని అంతా భావించారు. కానీ, మల్లు రవి చర్చలు జరిపిన తరువాత కూడా కాంగ్రెస్ అధిష్టానం టీజేఎస్‌కు కేటాయించే సీట్లపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు, కమ్యూనిస్టు పార్టీలకు చెరో రెండు సీట్లు కేటాయించేందుకు ఇప్పటికీ కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు జరుపుతోంది. దీంతో టీజేఎస్‌కు ఒక్క సీటు కూడా కేటాయించడానికి కాంగ్రెస్ అధిష్టానం అంతగా సుముఖంగా లేదనే చర్చ రాజకీయ వర్గాలలో సాగుతోంది. తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికలలో ఏ ఒక్క సీటు కూడా చేజార్చుకోవడానికి సిద్ధంగా లేదని చర్చ జరుగుతోంది. అందుకే ఇప్పటి వరకూ కాంగ్రెస్ అధిష్టానం టీజేఎస్‌తో పొత్తు, సీట్ల కేటాయింపుపై ఎలాంటి ప్రకటనా చేయలేదన్న విషయం స్పష్టమవుతోంది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో రెండో జాబితాను సైతం విడుదల చేసిన నేపథ్యంలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. టీజేఎస్‌కు సీట్ల కేటాయింపు లేనప్పటికీ కోదండరాం కాంగ్రెస్‌కు మద్దతిస్తారా లేక తమ పార్టీ బలంగా ఉందని భావించిన స్థానాలలో సొంతంగా అభ్యర్థులను నిలబెడతారా అన్నది వేచి చూడాలి.

### తండ్రి త్యాగం.. తనయుడికి సీటు

## మహబూబ్‌నగర్ బిజెపి అభ్యర్థిగా మిథున్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 27, ప్రభాత వార్త :** మహబూబ్‌నగర్ బీజేపీ అసెంబ్లీ టికెట్ ఎట్టకేలకు బీజేపీ అధిష్టానం ఫైనల్ చేసింది. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డికి కేటాయిస్తూ నిర్ణయించింది. ఆమేరకు శుక్రవారం సాయంత్రం అధికారిక ప్రకటన వెలువడడంతో పార్టీ శ్రేణులు మహబూబ్‌నగర్‌లో సంబురాలు చేసుకున్నారు.



మిథున్‌రెడ్డి (ఫైల్)

**విద్యార్హత: బిఇ (సిఎస్‌సి), ఎంబిఎ**

**రాజకీయ జీవితం..**

మిథున్‌రెడ్డి ఇప్పటివరకు ఎలాంటి పదవులు చేపట్టలేదు. అయినా గత పదేండ్లుగా మహబూబ్ నగర్ జిల్లా రాజకీయాల్లో కీలక వ్యవహరిస్తూ తండ్రి జితేందర్ రెడ్డి వెంట ఉంటూ అనుచర వర్గాన్ని తయారు చేసుకున్నారు. పార్టీ వ్యవహారాలతోపాటు సామాజిక బాధ్యతగా కూడా యాక్టివ్‌గా ఉంటున్నారు. అయితే గత కొద్ది రోజులుగా జితేందర్‌రెడ్డికి మహబూబ్‌నగర్ నుంచి మిథున్‌రెడ్డికి షాద్‌నగర్ అసెంబ్లీ టికెట్ కేటాయిస్తారని చర్చలు జరిగాయి. జితేందర్ రెడ్డి రెండు అసెంబ్లీ స్థానాలను కోరగా పార్టీ అధిష్టానం అందుకు సుముఖంగా లేనట్లు తెలిసింది. ఈ క్రమంలో ఎట్టకేలకు మహబూబ్‌నగర్ టికెట్ కేటాయిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నది. ఇదిలా ఉండగా మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డికి మహబూబ్‌నగర్ టికెట్ కేటాయించగా ఆయన తన కుమారుడికి అడిగినట్లు సమాచారం.

2019 పార్లమెంట్ ఎన్నికల్లో మిథున్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. చేవెళ్ల అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా పని చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో, మునుగోడుతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయడంలో తనవంతుగా ముఖ్యభూమిక పోషించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల క్యాంపెయిన్‌లో యాక్టివ్‌గా వ్యవహరించారు. ప్రజాసంగ్రామ యాత్రలో ప్రచారాతల ప్రభందక్‌గా 5దశల్లో పాల్గొన్నారు. ఖమ్మంలో జరిగిన బీజేపీ జాతీయ కార్యనిర్వాహక సమావేశంలోనూ స్టేజీ ఇన్‌చార్జిగా వ్యవహారాలు చూసుకున్నారు. కరోనా సమయంలో మహబూబ్ నగర్ ప్రజలకు మాస్కులు, శానిటైజర్లతోపాటు దవాఖానకు ఆక్సిజన్ సిలిండర్లు అందజేశారు. ప్రజా గోస బీజేపీ భరోసా పేరుతో నిర్వహించిన సమావేశాల్లో క్యాంపెయిన్ నిర్వహించారు.

**తండ్రి జితేందర్‌రెడ్డి అనుభవం..**

మిథున్‌రెడ్డి తండ్రి మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డికి 25ఏండ్ల రాజకీయ అనుభవం ఉన్నది. 1999లో లోక్‌సభకు బీజేపీ తరఫున ఎంపీగా, మళ్లీ 2014లో టీఆర్ఎస్ నుంచి మహబూబ్ నగర్ లోక్ సభ సభ్యుడిగా రెండుసార్లు విజయం సాధించారు. 2010లో టీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియమించబడ్డారు. మహబూబ్‌నగంలో రాజకీయంగా పట్టున్న నేతగా జితేందర్‌రెడ్డికి పేరున్నది. బీజేపీని బలోపేతం చేయడంలోనూ జితేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. 69ఏండ్ల వయస్సున్న జితేందర్‌రెడ్డి రాజకీయంగా, జిల్లాతోపాటు నియోజకవర్గంలోనూ ఎంతో ఎంతో పట్టున్నది. అయితే జితేందర్‌రెడ్డినే మహబూబ్ నగర్ నుంచి పోటీ చేయమని పార్టీ అధిష్టానం ఆదేశించగా తాను తన కుమారుడు మిథున్‌రెడ్డికి కేటాయించమని కోరినట్లు సమాచారం. అయితే జితేందర్‌రెడ్డి రాజకీయ అనుభవం మిథున్‌రెడ్డి గెలుపులో ఏమేరకు కీలకంగా మారుతుంతో వేచి చూడాల్సిందే.

# బిఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత

### కుటుంబ పాలన, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా బిజెపి పోరాటం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### బిజెపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం



**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏ అసెంబ్లీ నియోజకవర్గానికి వెళ్లినా బిఆర్ఎస్‌పై వ్యతిరేకత నెలకొందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో కిషన్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎంపి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం తన అనుచరులు, ప్రస్తుత, మాజీ సర్పంచ్, ఎంపి టిసిలతో కలిసి బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి పార్టీఓకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రత్నం తెలంగాణ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న దళిత నాయకులు అన్నారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. 1200 మంది బిడ్డలు ఆత్మబలిదానం చేసుకున్నారన్నారు. సకల జనుల పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణ, నేడు అవినీతి పరులు, మాఫియా చేతిలో బందీ అయిందన్నారు. కెసిఆర్ కుటుంబ పాలన, అవినీతి, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు స్పందిస్తున్నాం న్నారు. ఏ అసెంబ్లీ నియోజకవర్గానికి వెళ్లినా బిఆర్ఎస్‌పై వ్యతిరేకత నెలకొందన్నారు. కొంత మంది మీడి బిజెపిపై వ్యతిరేకంగా తప్పుడున ప్రచారం చేస్తున్నారన్నారు. కుటుంబ పాలన, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా బిజెపి పోరాటం చేస్తుందన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఒకటేనంటూ రాహుల్‌గాంధీ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణ పోరాట చరిత్ర గురించి ఏ మాత్రం తెలియని రాజకీయ అజ్ఞాని రాహుల్‌గాంధీ అన్నారు. బిఆర్ఎస్‌కు కాంగ్రెస్ బి టీం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పనిచేసింది కెసిఆర్ అన్నారు. గతంలో అనేక ఎన్నికల్లో పోటీ చేసి, పొత్తు పెట్టుకున్నారన్నారు. మజ్లీస్ పార్టీతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న బిఆర్ఎస్ పార్టీ అన్నారు. మా ప్రాణం ఉన్నంత వరకు బిజెపి మజ్లీస్ పార్టీతో కలవదన్నారు. బిజెపి ప్రజల టీమ్ తప్ప, ఏ పార్టీకి టీం కాదన్నారు. పచ్చి అవకాశ వాదులు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు అన్నారు. బిజెపి చెప్పిన మాట నెరవేర్చి చూపెడుతుందన్నారు. రక్తపు బొట్టు చిందకుండా అయోధ్యలో రామమందిరం నిర్మిస్తుంది మోడీ ప్రభుత్వం అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నెలకొన్న అనేక సమస్య లకు పరిష్కారం చూపిందన్నారు. ఆత్మవిశ్వా సంతో ముందుకెళ్లి, తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. ప్రజలకు ఆకాంక్షలను అను గుణంగా, నీతివంతమైన పాలన అందిస్తామన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మోత్కుపల్లి, నేతి విద్యాసాగర్

### ఢిల్లీలో రాజగోపాల్‌కు కండువా కప్పిన ఖర్గే



**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాత వార్త :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలోకి నేతల వలసలు పెరుగుతున్నాయి. శుక్రవారం న్యూఢిల్లీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రధాన పార్టీల నుంచి వలస వచ్చిన నాయకులతో సందడిగా మారింది. బిజెపి పార్టీకి ఈనెల 25న రాజీనామా చేసిన కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కండువా కప్పి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పలు పార్టీల నేతలు రావడంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం పెరుగుతున్నది. మల్లికార్జున ఖర్గే సమక్షంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ నేతి విద్యాసాగర్, కపిలవాయి దిలీప్‌కుమార్‌తో పాటు పటాన్‌చెరువుకు సంబందించిన బిఆర్ఎస్ నేత నీలం మధు కాంగ్రెస్ పార్టీలో చేరినారు. వీరందరికి ఖర్గే కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్,మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్ గురువారం రాత్రి మాణిక్‌రావ్ ఠాక్రేసమక్షంలో కాంగ్రెస్‌లో చేరినారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసివేణుగోపాల్ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మాణిక్‌రావ్ ఠాక్రే పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సిఎల్‌పి నేత భట్టీ విక్రమార్క, కొమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎక్స్ వేదికపై ట్వీట్ చేస్తూ తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్‌ను తిరస్కరిస్తున్నారు అనడానికి వీరి నిష్క్రమణ ఒక సంకేతం అన్నారు.

**The Singareni Collieries Company Limited**
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM- 507101, Telangana.
**E-PROCUREMENT TENDER NOTICE**

Tenders have been published for the following Services/Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in-or- https://www.scclmines.com

**NIT/Enquiry No. - Description / Subject - Last date and time for Submission of bid(s).**

**E0723O0175-** Procurement of Water Mist Fire Fighting Systems (9 Ltrs and 50 Ltrs) to various areas of SCCL - 02.11.2023 - 17:00 Hrs.

**E1223O0222-** Hiring of 2 (Two) Nos of not less than 500 TPH capacity Mobile/ SEMI-Mobile Crusher for crushing 75 LT of coal to -100mm size at KCHP, Manuguru for a period of 3 years - 03.11.2023 - 17:00 Hrs. **General Manager (Material Procurement)**

**NIT/Enquiry No.- Description / Subject / Estimated Contract Value - Last date and time.**

**CRP/CVL/KGM/TN-48/2023-24, Dt.16.10.2023-** Construction of 33KV/3.3KV Sub-station for 4 Nos. of mobile crushers, Off-loading camp and 40HP/75HP pump motor etc., at VK Coal mine, Kothagudem area, Bhadradri Kothagudem Dist, Telangana State. Rs. 58,89,128/- - 31.10.2023- 04.30 P.M

**CRP/CVL/RG-II/TN-49/2023-24, dt.18.10.2023-** Construction of retaining wall (1 No), sub-station (1 No) and providing foundation beds for erection of feeder breakers (2 nos) including connecting gantries (Phase-II) near RG OCP-III CHP, RG-II Area, Godavarikhani, Peddapalli Dist., Telangana State. Rs. 2,93,58,919/- - 02.11.2023- 04.30 P.M.

**CRP/CVL/YLD/TN-50/2023-24, Dt.26.10.2023-** Laying of DBM and BC as renewal coat on existing damaged portions of coal transport road from Tekulapalli to Koyagudem OCP, Yellandu area, Bhadradri Kothagudem District, Telangana State. Rs. 1,16,02,912/- - 10.11.2023- 04.30 P.M. **General Manager (Civil)**

PR/2023-24/ADVT/MP/CVL/54

**DIPR.No.8191-PP/CL/Advt/1/2023-24, Dt: 27.10.2023**

**FINKURVE FINANCIAL SERVICES LIMITED**
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013

**PUBLIC NOTICE**

**Finkurve Financial Services Ltd.** through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: **05.11.2023** వ సమయం **10** గంటలకు **Augmont Gold For All H No 11-2-30, 1st floor, Near congress Bhavan, Wyra Road, Khammam-507001.** వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.

**SREE MAHEERA KHAMMAM :**
SREE-89312, SREE-51054, SREE-64294,
SREE-38169, SREE-97163, SREE-61615,
SREE-02190, SREE-49918, SREE-69702.

**For More Details, Call : Kakkerla Sukumar : Mob. 9704858037**

(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

వార్త


శరీరం, మనస్సు, ఆత్మల కూడికయే మానవత్వం.

-సత్యసాయి బాబా

# అవినీతిరహిత సమాజం సాధ్యమేనా?

ఒర్లిఒర్లి వారుపోతారు వందుకతిని మనం పోదాం అన్నట్లుగా ఉంది అవినీతిపరులైన అధికారుల వ్యవహారశైలి. ఒక పక్క అవినీతి అధికారులను వలపన్ని పట్టుకుంటున్నారు. ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులపై దాడులు చేసి సీజ్ చేస్తున్నారు. జైళ్లకు పంపుతున్నారు. ఆ మధ్య తెలంగాణలో కోటి రూపాయల లంచం తీసుకుంటూ ఒక ప్రభుత్వఉద్యోగి పట్టుబడి ఆ తర్వాత జైలులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా మరోకపక్క జంకుబొంకు లేకుండా కొందరు అధికారుల అవినీతి నిరాటంకంగా కొనసాగుతున్నది. గత రెండు, మూడు నెలలుగా తెలుగురాష్ట్రాల్లో ఏదోఒకచోట పట్టుబడుతూనే ఉన్నారు. ఈ దాడులు కానీ, కేసులు కానీ అవినీతిని ఆపలేకపోతున్నాయి. అంతకంతకు విస్తరిస్తూనే ఉన్నది. అవినీతికి పాల్పడేవారిసంఖ్య దేశవ్యాప్తంగా చూస్తే కోట్ల సంఖ్యలో ఉండొచ్చు. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు చేస్తున్నామని నేతలు చెప్పుకుంటున్నా అది అంతకంతకు పెరుగుతున్నదే తప్పతగ్గడం లేదు. అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. మంత్రులు కూడా ఇందుకు మినహాయింపుకాదని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏనాటి నుంచో హెచ్చరిస్తూనే ఉన్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న భారీ అవినీతి దేశానికి పెనుసవాలు విసురుతున్నదని, చెదలపురుగులా పట్టిపీడిస్తున్నదని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మొన్న ఆ మధ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ విజిలెన్స్ యాంటికరప్షన్' సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ వారసత్వంగా మారిన కుంభకోణాలు, కొన్ని రాష్ట్రాల రాజకీయాల సంస్కృతిలో అంతర్భాగమైపోయాయని, అక్రమాలకు పాల్పడినవారికి సరైన శిక్షలు పడకపోతే వచ్చేతరం మరింతగా రెచ్చిపోతుందని ఆ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అలాగే నల్లధనం కూడబెట్టే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోయినా చిన్నచిన్న శిక్షలతో సరిపెట్టినా చుట్టుపక్కల వారికి మరింత ధైర్యం ఇస్తుందన్నారు. అవినీతి కేసుల దర్యాప్తులో జరిగే జాప్యం అది ఆ ఒక్కకేసుకే పరిమితం కాదని, అది ఒక శృంఖలాన్ని తయారు చేస్తుందని, భవిష్యత్‌లో కుంభకోణాలకు పునాదిరాయి అవుతుందని అభిప్రాయపడ్డారు. అప్పుడే కాదు ఏ సందర్భంవచ్చినా అవినీతి ప్రస్తావన వచ్చినప్పుడు ప్రధానమంత్రి ఘాటుగా స్పందిస్తున్నారు. అవినీతి దేశాభివృద్ధికి తీవ్ర అవరోధంగా మారుతున్నదని హెచ్చరించారు. అవినీతి ప్రభావం దీర్ఘకాలంగా ఉంటుందని, అలాగే భవిష్యత్‌లో మన బిడ్డలే బలికావాల్సి వస్తుందని సోదాహరణగా వివరించారు. ప్రజాపనుల విభాగంలో ఒక ఇంజినీర్ నాసిరకం వంతెన నిర్మిస్తున్నా పట్టించుకోకుండా దొడ్డిదారి వద్దనుండి డబ్బులు తీసుకుంటే అతన్ని ఎవరూ పట్టుకోకపోతే ఆనందంగా రిటైర్డ్ అయిపోతాడు. ఒకరోజు ఆ వంతెన కూలిపోయి ప్రమాదంలో యుక్తవయసులో ఉన్న ఆయన కుమారుడే చిక్కుకొని ప్రాణాలు కోల్పోతే ఈ అవినీతికి ఎంతటి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందో ఆ ఇంజినీర్‌కు అప్పుడు తెలిసి వస్తుందన్నారు. అందుకే అటువంటి పరిస్థితులను మార్చే బాధ్యత దేశపౌరులపై అందరిపై ఉందని ప్రధాని వివరించారు. ఆయన ఆవేదనలో, మాటల్లో ఎంతో అర్థం ఉంది. ఆయనేకాదు లాల్‌బహాదుర్‌శాస్త్రి, గుల్జారీలాల్‌నంద వంటి వారు తెలుగురాష్ట్రాలకు చెందిన దామోదరంసంజీవయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, జువ్వాడి చొక్కారావు వంటి ఎందరో నేతలు అవినీతికి ఆమడదూరంలో ఉంటూ దానిని నిర్మూలించేందుకు తమవంతు కృషి చేశారు. కానీ అవినీతి ముందు వారు ఓడిపోయారని చెప్పలేం కానీ విజయం సాధించలేకపోయారు. ఫలితంగా పొగమంచులా విస్తరించిపోయింది. అధినేతలు ఎంతగా అరచికేకలు పెడుతున్నారో అంతకురెట్టింపు స్థాయిలో అవినీతి పెరుగుతుందనడంలో సందేహం లేదు. గతంలో లేదనికాదు. కానీఇప్పుడు అది శృతిమించిపోతున్నది. దేనికైనా హద్దూపద్దూ ఉండాలి. దారులుకొట్టి బతికే బందిపోటు దొంగలు సైతం దోపిడీ తర్వాత దోపిడీకి కొంత వ్యవధి ఇస్తారు. కానీ కొందరు అధికారులు ఆసమయం కూడా ఇవ్వడం లేదు. అవినీతి నిర్మూలనకు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. వలపన్ని పట్టుకుంటున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులను అక్రమార్కులపై దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. సంఖ్యాపరంగా కూడా తక్కువేమీ కాదు. ఇంతపెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నా అవినీతి పరులుగా ప్రచారం అవుతున్నా వారిలో ఏమాత్రం భయభక్తులు లేకుండాపోతు న్నాయి. రాష్ట్రంలో ఎసిబి కానీ, కేంద్రస్థాయిలో సిబిఐ అధికారుల దాడులంటే ప్రస్తుతం అంతగా పట్టించుకోవడం లేదు. గతంలో అంతోఇంతో భయభక్తులుండేవి. పట్టుబడి అరెస్టు అయి జైలుకు వెళ్లితే సమాజంలో విలువ ఉండదని జంకుబిడియం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. అవినీతిపరులకు వత్తాసుపలికే రాజకీయ నాయకులు లేకపోలేదు. కొందరు వీరికి రక్షకులుగా నిలబడుతున్నారు. వీగిపోతున్న కేసులను చూస్తే ఇందుకు బలం చేకూరుతున్నది. పట్టుబడిన కేసులు ఏమవుతున్నాయి? న్యాయస్థానాల్లో రుజువుకాక శిక్షల నుంచి తప్పించుకొని నిర్దోషులుగా ఎలా బయటపడుతున్నారు? అసలు ఈ కేసుల వెనుక ఏం జరుగుతున్నది? ఎన్ని కేసుల్లో శిక్షలు పడుతున్నాయి? తదితర విషయాలు పరిశీలిస్తే విస్తుపోయే సంగతులు వెలుగులోకి వస్తాయి. ప్రభుత్వ విభాగాలు కానీ, చట్టాలు కానీ ఏమీ చేయలేకపోతున్నాయనేది ఎన్నో సార్లు బయటపడింది. రాజకీయాలతో ముడిపడి ఉన్న అవినీతిని నిర్మూలించలేకపోతే పోయారు. కనీసం నిత్యం ప్రజలను వేధిస్తున్న అవినీతి విషయంలో అయినా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రజల ముందు బాహాటంగా జరుగుతున్న అవినీతి నిర్మూలనకు అయినా తక్షణం నడుం కట్టాలి.

మాట మానవత్వానికి ప్రతీక, నిశ్శబ్దత దైవత్వానికి సంకేతం.



థామస్ కార్లైల్

మన అదృష్ట, దురదృష్టాలకు తరచు కారణమయ్యేది మన మాటలు.



సర్.డబ్ల్యు ర్యాలీ

## ప్రజావాక్కు

### ప్రాణాలు హరిస్తున్న పొగమంచు

**ఉష్ణోగ్రతల్లో** ఈవారం ప్రారంభం నుంచి మార్పు కనిపిస్తుంది. ఎండ తీవ్రత తగ్గి సాయంత్రం వేళల్లో చలిగాలులు, తెల్లవారు జామున పొగమంచు కురుస్తుంది. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల వరకు పొగమంచు చట్టంగా అలముకుంటుంది. దీంతో రోడ్లపై ప్రయాణించే వాహన డ్రైవర్లకుఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముందున్నవాహనాలు, రోడ్డుమార్జిన్లు స్పష్టంగా కనిపించడం లేదు. జాతీయ రహదారులపై ప్రయాణం ఇబ్బందిగా మారుతుంది. డ్రైవర్లు వాహనాల హెడ్లైట్లు ఇష్టానుసారం మారుస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పొగమంచు కారణంగా కర్ణాకటలో జరిగిన ప్రమాదంలో 13 మంది మృత్యువాత పడడం కలచివేస్తుంది. వీలైనంతవరకు పొగమంచులోప్రయాణం చేయరాదు. ఒకవేళ ప్రయాణించాల్సి వస్తే లోబీమ్ లైట్లు వాడుతూ ప్రయాణించాలి.

-చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

### ఓట్ల అంచనాలు

**నవంబర్** 30వ తేదీన జరిగే ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులుప్రతినియోజకవర్గంలో, ప్రతిమండలంలో, ప్రతి గ్రామంలో, ప్రతి బూతులలో ఓట్లు తమ అభ్యర్థులకు రావడం కోసం ఎవరికివారుగా అంచనాలు వేసుకుంటున్నారు. ఆయా రాజకీయ పార్టీలు కులాలవారీగా, వర్గాలవారీగా ఓట్ల లెక్కింపు చేసుకుంటున్నారు. ప్రతి రాజకీయ పార్టీ ఆయా అనుబంధ సంఘాలు వారి సంఖ్యతోపాటుగా వారి కుటుంబాలు, బంధువులు రక్త సంబంధీకులు స్నేహితులు శ్రేయోభిలాషులు వారిగా లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరికివారు అంచనాలు వేసుకోవడంతో అభ్యర్థులను అయోమయానికి గురిచేస్తుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్‌జిల్లా

### అమలుకాని పథకాలు వద్దు

**శాసనసభ** ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందుగానే రాజకీయ పార్టీలన్నీ గెలుపు కోసం అడ్డదారులు తొక్కడం ఆందోళన కలిగిస్తోంది. అధికార పార్టీకి చెక్‌పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఇటీవల కాంగ్రెస్ పార్టీ పెన్షన్ డబ్బుల్ని నాలుగువేలకు పెంచుతాం అనగానే దివ్యాంగుల పెన్షన్ నాలుగువేల పదహారుకు పెంచుతున్నట్టు కెసిఆర్ ప్రకటించడం, ఆ వెంటనే అమలు చేయడం ఆశ్చర్యం కలిగించింది. తాజాగా దళితబంధు రూపాయలు పది లక్షల్ని కాంగ్రెస్ 12 అనగానే 15 లక్షలకు మేము రెడీ అన్నట్లుగా బిఆర్ఎస్ ఆలోచనలు గుప్పుమన్నాయి.

-పి. శ్రీనివాస్, జగిత్యాలజిల్లా

### విజ్ఞతతో ఓటువాక్కును వినియోగించుకోండి

**ఇప్పటికే** మనుగడ సాగిస్తున్న లేక రేపు ఎన్నికల్లో కొత్తగా కొలువుతీరబోతున్నకేంద్ర, రాష్ట్రాల్లో ఏపార్టీ ప్రభుత్వాలైనా పూర్తిగా ప్రజాసమస్యలపై దృష్టి పెట్టే నాయకులను ఎన్నుకోవాలని, కనీస ప్రజావసరాలకు తగినంత ప్రాధాన్యత కల్పించడం, ఆర్థిక భారంతోప్రజల నడ్డివిరుస్తున్న ధరలపై దృష్టిపెట్టడం, ప్రభుత్వ పరంగా ప్రజలపైపన్నుల భారం వేయకుండా ఆదాయం పెంచుకునే మార్గాన్ని ఎంచుకోవడం, కరెంటు మున్సిపల్ బిల్లులు లాంటివి నిత్యావసరవస్తువుల ధరలుఅదుపులో ఉంచి ప్రజలకు భారం కాకుండా చూడడం ప్రతిపార్టీ అజెండాలోనూ భాగం కావాలి. మేనిఫెస్టోను అమలుచేసే కార్యాచరణ కావాలి. ప్రభుత్వం ఏర్పడ్డ మరుసటి రోజు నుండే ప్రజలే అజెండాగా వారి తక్షణ అవసరాలు, దీర్ఘకాలిక ప్రయోజనాలు, తర్వాత తరాలకు సరిపడాఅభివృద్ధిప్రణాళికలు వేసివెంటనే బడ్జెట్‌లో కేటాయించి నిబద్ధతతోఅమలుచేయగలిగిన నాయకులకు ప్రాధాన్యమివ్వాలి.

-జోస్యుల వేణుగోపాల్, హైదరాబాద్

### రిజిస్ట్రేషన్ల విషయంలో బహుపరాక్!

**నేటి** సమాజంలో వృద్ధులను ఏ మార్చి, కళ్లుగప్పి, వారికి ఏవో కల్లబొల్లి కబుర్లు చెప్పి, నయానో, భయానో వారిపై ఒత్తిడి తెచ్చి ఒక కుటుంబంలో అందరికి సంక్రమించాల్సిన ఆస్తులను దొడ్డిదారిలో ఒక్కరే రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న దారుణ, దగాకోరు చేసే పరిస్థితులు ప్రస్తుతం మన కళ్లముందు తరచుగా సాక్షాత్కరిస్తున్నాయి అనేమాట సత్యదూరంకాదు. ఒక్కొక్కసారి నయవంచన అనే వక్రబుద్ధి గల సొంత ఇంటి మనుషులలోని కొంత మంది తిన్నింటివాసాలు లెక్కబెట్టేవారు అందరికి చెందాల్సిన ఆస్తులను అక్రమ మార్గంలో చట్టవిరుద్ధంగా తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా అత్యంత గోప్యంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, తమ ఆధీనంలోకి తెచ్చుకొని మరీ ఆస్తులను అడ్డదారిలో తమ పేర రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న సంఘటనలు కోకొల్లలుగా ప్రస్తుత సమాజంలో సంభవిస్తున్నాయి.

-బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల, నంద్యాలజిల్లా

### మాట తప్పడం మంచిదికాదు

**తెలంగాణ** ప్రజల కలను సాకారం చేసిన సోనియాగాంధీ దేవత అని ఆవిడకి కోటి దండాలు పెట్టినా తక్కువే అని టిఆర్ఎస్‌ని కాంగ్రెస్‌పార్టీలో విలీనం చేసి సోనియా గాంధీ రుణం తీర్చుకుంటానని విభజిత తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి నేనుండనని, దళితుడిని ఆపదవిలో కూర్చుండబెడతానని, మాట్లాడిన కెసిఆర్ ఆ తరువాత తన మాటలను మరిచిపోయారు. రాష్ట్రం తనచేతుల్లోకి వచ్చాక సోనియాగాంధీ మొహం అయినా చూడలేదు.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్న మేనిఫెస్టోలు

**మేనిఫెస్టో ప్రకటించడం అంటే తాము చేస్తున్న వాగ్దానాలు త్రికరణశుద్ధిగా నిబద్ధతతో నెరవేరుస్తామని కోట్లాది మంది ప్రజలకు తిరుగులేని హామీ ఇవ్వడం. అలా ప్రజల ముందు పెట్టిన ప్రమాణ పత్రంలోని అంశాలను పట్టించుకోకపోతే ఏమనుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? అందుకే ఎన్నికల విధానంలో సమగ్ర మార్పులు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఎంతో కీలకమైనవి. ఆ ఎన్నికల్లో ఏ పార్టీ అయినా తమ మేనిఫెస్టోలతోనే ఎన్నికల రణక్షేత్రంలో పోరాడుతాయి. అందుకే రాజకీయ పార్టీలకు మేనిఫెస్టోలు ఊపిరి. అలాంటి మేనిఫెస్టోల ద్వారా ఆచరణసాధ్యంకానీ హామీలు ప్రకటించి ఆ తర్వాత విస్మరించడమో లేక మాటమార్చి ప్రజల జీవితాలతో ఆటలాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.**

దామెర్ల సాయిబాబ

ఆచరణయోగ్యమైనవే చెప్పాలి. చెప్పిన తర్వాత ఎంతటి కష్టాన్ని అయినా భరించి ఆచరించాలి. అంతేకానీ ముందూ వెనుక ఆలోచించకుండా తాత్కాలిక అవసరాలకోసమో, లేక ఆవేశంతోనో ప్రకటించడం, ఆ తర్వాత మాటమార్చడం, ప్రజాభిమానం ఉన్న నేతలకు ఏమాత్రం మంచిదికాదు. కీలకపదవుల్లో ఉన్న నేతలు అన్ని కోణాల్లో ఆలోచించి పెదవి విప్పాలి. వచ్చినవాడు సాక్షాత్తు మహావిష్ణువు అని అంతం చేయడానికే వచ్చాడని కుల గురువు శుక్రాచార్యులు ఎన్ని విధాలుగా చెప్పినా ఇచ్చిన మాట తప్పనని ప్రాణత్యాగానికే ఆనాడు బలిచక్రవర్తి సిద్ధపడ్డాడు. ఇలా పురాణ ఇతిహాసాల్లో ఎందరో మహానుభావులు ఇచ్చిన మాటకోసం సకల కష్టాలు అనుభవించి చివరకు ప్రాణత్యాగం చేయడానికి వెనుకాడలేదు. మారిన కాలమాన పరిస్థితుల్లో అలా ఉంటారని, ఉండాలని అనుకోవడం అత్యాశే అవుతుంది. ప్రజలకు ఆదర్శనీయంగా, అనుకరణీయగా ఉండాల్సిన నేతలు వ్యవహరిస్తున్నతీరు, చేస్తున్న వాగ్దానాలు, చివరకు పార్టీలు విడుదల చేస్తున్న మేనిఫెస్టోలు చూస్తుంటే ప్రజాస్వామ్యం ఎంత అపహాస్యం పాలవుతుందో అర్థమవుతుంది. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓట్ల కోసం, సీట్ల కోసం అధికారం కోసం, పదవుల కోసం చేస్తున్న వాగ్దానాలు, మొక్కుతున్న ఆపద మొక్కులు చూస్తుంటే విస్మయం కలుగుతున్నది. ఈపార్టీ, ఆపార్టీ అని కాదు. అన్ని పార్టీల పరిస్థితి అలాగే ఉంది. మేనిఫెస్టోలో ప్రకటించిన వాగ్దానాలను నెరవేర్చగలరా? నెరవేర్చాలంటే ఎన్ని లక్షలకోట్లు అవుతుందో అంచనాలున్నాయా? ఉంటే ఆ డబ్బు ఎక్కడి నుండి వస్తుంది? ఎలా సేకరించగలుగుతారు? తదితర అంశాలు ఆలోచించారా? ఏమైనా ప్రణాళికలున్నాయా? అనే ప్రశ్నలకు జవాబులు దొరక్కపోవచ్చు. నిత్యం ప్రజలను ఎలా ఆకట్టుకోవాలనే లక్ష్యం తప్ప మరొకటి కన్పించడం లేదు. ఇక కొందరు నేతలు చేస్తున్న విన్యాసాల గూర్చిఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదేమో. గతంలో ప్రచారం చేసిన నేతలు ఎంతో హుందాగా వ్యవహరించేవారు. తాము చేసిన కార్యక్రమాలు, అభివృద్ధి సంక్షేమ సేవలు, అలాగే భవిష్యత్తులో చేసే కార్యక్రమాలు ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించేవారు. ఆనాడు నేతలు కానీ, పార్టీలు కానీ మేనిఫెస్టోల్లో పేర్కొనే అంశాలు, వాగ్దానాలు వాస్తవానికి దగ్గరలో ఉండేవి. అంతేకాదు వారి వేషభాషల్లోనూ, వ్యవహారశైలిలోనూ ఎంతో హుందాతనం ఉండేది. విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండేవి. వ్యక్తిగత దూషణలకు పాల్పడేవారు కాదు. చాలావరకు తాము చేసిన పనులు చేయబోయే పనులు గూర్చి వివరించి అధికారపార్టీ నేతలు ఓట్లు అభ్యర్థించేవారు. అధికారంలో ఉన్ననేతలు చేసిన పొరపాట్లను ఎత్తిచూపుతూ, విమర్శనాస్త్రాలు సంధిస్తూ, తాము అధికారంలోకి వస్తే తాము చేయబోయే కార్యక్రమాలను, పథకాలను వివరిస్తూ ఓట్లు వేయమని అభ్యర్థించేవారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. శాసనసభ ఎన్నికలే కాదు. పార్లమెంటు ఎన్నికలయినా, పంచాయతీ ఎన్నికలయినా ఇదే తంతు జరుగుతున్నది. చిరుహోటళ్లలోకి వెళ్లి తామే తినుబండారాలు చేస్తున్నారు. కొందరు చీపురు పట్టుకొని ఊడుస్తున్నారు. ఇలాంటి విన్యాసాలు చేస్తూ ఫొటోలు దిగి ప్రచారానికి ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విన్యాసాలతో ఆయా వర్గాలకు దగ్గరై ఓట్లు సంపాదించాలనే ఆలోచనతో ఈ కళలన్నీ ప్రదర్శిస్తున్నారని అందరికి తెలిసిందే. ఇక మేనిఫెస్టోలు ప్రహసనంగా మారిపోతున్నాయి. పోటీలుపడి వరాల జల్లులు కురిపిస్తున్నారు. ప్రజలు అడిగినవేకాదు ఎన్నో అడగనివి కూడా మేనిఫెస్టోలో పొందుపరుస్తున్నారు. పోనీ గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ఐదేళ్లలో ఏ మేరకు పట్టించుకున్నారు? వాటిలో ఎంతమేరకు ఎన్ని అమలయ్యాయి? అమలు కాకపోతే ఎందుకు చేయలేకపోయారు? తదితర ప్రశ్నలకు జవాబుదొరకదు.

**ఒక్క మాట**

పోటీలుపడి వరాల జల్లులు కురిపిస్తున్నారు. చిన్నాచితక పార్టీల సంగతి అలావుంచితే. ప్రధానపార్టీల నేతలు చేస్తున్న వాగ్దానాలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. ఈసారి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు రసవత్తరంగా మారాయి. నిధులు వెదజల్లడంలోనే ఎవరికి ఎవరూ తీసిపోవడం లేదు. ఇంకా పార్టీలు పూర్తిగా తమ అభ్యర్థులను ప్రకటించలేదు. అభ్యర్థులపై కసరత్తు జరుగుతూనే ఉంది. మరొకపక్క అసమ్మతులను బుజ్జగించే కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. కానీ ఎన్నికలవేడి గ్రామాలను చుట్టుముట్టింది. ఇప్పటికే ఓటర్లకు పంచాల్సిన మద్యం, డబ్బు ఆయా ప్రాంతాలకు చేర్చుకున్నట్లు సమాచారం. నిన్నటివరకు దాదాపు 340కోట్ల రూపాయల విలువైన నగదుతోసహాబంగారం, మద్యం, చీరలు లాంటివి పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాయి. గత ఎన్నికల్లో మొత్తం అంతా కలిపి రూ.130 కోట్లు దాటకపోతే ఇప్పటికే ఈసారి రూ.340 కోట్లు దాటడంతో అది ఎంతవరకు పోతుందో అంచనా వేయలేకపోతున్నారు. మొన్న మునుగోడుకు జరిగిన ఉప ఎన్నికల్లో దాదాపు ఐదువందల కోట్ల రూపాయలు వెచ్చించారని ప్రచారం జరిగింది. ఇకబహిరంగ సభలకు జనసమీకరణ ఏర్పాట్లకు కోట్లాది రూపాయలు ఖర్చవుతున్నది. ఇక నాయకులు కాలికి బలపం కట్టుకొని వీధివీధికి తిరుగుతున్నారని చెప్పొచ్చు. ప్రచారంలో బిఆర్ఎస్ నేతలు ముందుకు దూసుకపోతున్నారు. కాంగ్రెసు పార్టీ టిక్కెట్ల కేటాయింపులో ఢిల్లీలో చర్చోపచర్చలతో మునిగితేలుతున్నారు. బహుశా శుక్రవారంరాత్రికి పూర్తికావచ్చంటున్నారు. ఇక బిజెపి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది. రెండు పార్టీలకు చెందిన అభ్యర్థుల జాబితా వెలువడిన తరువాత తమ తుది లిస్టు ప్రకటిస్తారంటున్నారు. అభ్యర్థులతో సంబంధం లేకుండానే వాగ్దానాల వర్షంకురిపిస్తున్నారు. మొత్తంమీద ఈ ఆరాట పోరాటంలో ఏమి హామీలిస్తున్నారో, అవి ఎంతవరకు అమలు చేయగలుగుతారో ఆలోచించడంలేదు. విజయమే లక్ష్యంగాఏహామీ ఇవ్వడానికి కూడా వెనుకాడడంలేదు. రానురాను ఎన్నికల వ్యయం అంచనాలను మించిపోతున్నది. వాగ్దానాల సంగతి అలావుంచినా పార్టీలు అధికారికంగా ప్రకటిస్తున్న మేనిఫెస్టోలకు జవాబుదారీతనం లేకపోవడంవల్లనే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రజలు కూడా అలవాటుపడుతున్నారు. ఎన్నికల్లో వాగ్దానాలు ప్రజల్లో నమ్మకాలను సన్నగిల్లిస్తున్నాయి. ఇవి అయ్యేవా, పోయ్యేవా ఏదో ఓట్లకోసం చెబుతున్నారని ప్రజలుభావించే పరిస్థితులు దాపురించాయి. అందుకే మేనిఫెస్టోలను ప్రజలు అంతగా పట్టించుకోవడం లేదు. జవాబుదారీతనం లేకపోవడం వల్ల రాజకీయనేతలు ఇష్టానుసారంగా వాగ్దానాలు మేనిఫెస్టోల్లో పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి చట్టబద్ధత లేకపోవడంవల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయని, ఎన్నికల ప్రణాళికలను కచ్చితంగా నెరవేర్చేలా చూడాలంటూ గతంలో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు నెరవేర్చాలనేఅంశం పట్టించుకోవాల్సిన అవసరం న్యాయస్థానాల పరిధిలో లేదని సుస్పష్టంగా పేర్కొంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు కచ్చితంగా నెరవేర్చాలని రాజ్యాంగ నిబంధనల్లో కానీ పార్లమెంట్ చట్టంలోకానీ లేకపోవడంవల్లనే న్యాయస్థానాలు ఇందులో జోక్యం చేసుకోలేకపోతున్నాయి. అంతేకాదు ఓటర్లను వలలో వేసుకునే హామీలకు, రాజకీయపార్టీలు దూరంగా ఉండాలని 2014లో ఎన్నికల సంఘం నియమావళి సూచించినా దానికి చట్టబద్ధత కల్పించలేదు. అందుకే రాజకీయపార్టీల నేతలు ఇష్టానుసారంగా హామీల వర్షం కురిపిస్తున్నారు. మేనిఫెస్టో ప్రకటించడం అంటే తాము చేస్తున్న వాగ్దానాలు త్రికరణశుద్ధిగా నిబద్ధతతో నెరవేరుస్తామని కోట్లాదిమంది ప్రజలకు తిరుగులేని హామీ ఇవ్వడం. అలా ప్రజల ముందుపెట్టిన ప్రమాణపత్రంలోని అంశాలను పట్టించుకోకపోతే ఏమనుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? అందుకే ఎన్నికల విధానంలో సమగ్రమార్పులు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఎంతోకీలకమైనవి. ఆ ఎన్నికల్లో ఏపార్టీ అయినా తమ మేనిఫెస్టోలతోనే ఎన్నికల రణక్షేత్రంలో పోరాడుతాయి. అందుకే రాజకీయపార్టీలకు మేనిఫెస్టోలుఊపిరి. అలాంటి మేనిఫెస్టోల ద్వారా ఆచరణసాధ్యంకానీ హామీలు ప్రకటించి ఆతర్వాత విస్మరించడమోలేక మాటమార్చి ప్రజల జీవితాలతో ఆటలాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంచేయడమే. ●

# కనుమరుగవుతున్న విద్యార్థి నాయకత్వం!

సభావట్ కళ్యాణ్

నేటి విద్యావ్యవస్థలో విద్యార్థి నాయకులు, విద్యార్థి సంఘాల అవశ్యకత చాలా ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, వ్యవస్థల్లో సమూల మార్పులు వచ్చినా పాత సమస్యలు ఏదోలా వెంటాడుతుంటాయి. కొత్త సమస్యలు పుడుతున్నాయి. ఈ సమస్యలను విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకువెళ్తే మా చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తే పరిస్థితిని నేడు చూస్తున్నాం. పుస్తకాలు పట్టుకొని చదువు కోసం కాలేజీలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఉద్యమబాట పడితే, సమస్యలపై పోరాటబాట పడితే, చదువులు చెప్పాల్సిన గురువులే విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి అణిచివేయడం అనేది సర్వసాధారణం అయిపోయింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న విద్యార్థుల బాధలు వినడానికి, వారి ముందు ఉండి తెగించి కేసులు, జీవితాన్ని లెక్కచేయకుండా మన సమస్యల ఉద్యమంద్వారా సమాజానికి, ప్రభుత్వానికి తెలిసేలా చేద్దాం కలిసి రండి అని నడిపే వ్యక్తిత్వం ఒక విద్యార్థి నాయకులకు మాత్రమే ఉంటుంది. ఒకప్పుడు విద్యార్థి నాయకుల నుండి రాజకీయ నాయకులుగా మారేవారు. కానీ నేటి సమాజంలో విద్యార్థి నాయకులంటే అణిచివేసే దుస్థితి. ఎంతోమంది మేధావులు దీనిని ఖండిస్తున్నారు. ఎందుకంటే నేటి విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను పోరాడి పరిష్కరించగలిగేది ఒక విద్యార్థి నాయకులు మాత్రమే. దీనినే మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం కొన్ని దశాబ్దాలుగా విద్యార్థి లోకం నుంచి ఒక చెప్పుకోదగ్గ పెద్ద నాయకుడు ఎవరు ఉద్భవించలేదని ప్రస్తావించారు. ఒక మాజీ సిజెఐ ఇలా ప్రస్తావించారంటే లోపాలు ఉన్నట్టే కదా! ఇందులో గురువుల తప్పుఉంది. ఒక విద్యార్థి తన సమస్యను ముందు పెట్టినప్పుడు సర్దుకుపోవాలని నచ్చచెప్తున్నారు. కానీ ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో చెప్పడంలేదు. పైగా ఉన్నతాధికారులకు కొమ్ము కాస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేయడం కలకలం సృష్టించే అంశం కదా? విద్యార్థులను వ్యవస్థల్లో లోపాలకు అలవాటుపడేలా చేయడం వలన పట్టభద్రులు అయ్యాక వారు పని



చేసే వ్యవస్థల్లో కూడా సర్దుకుపోతున్నారు. దాని కారణంగా ప్రశ్నించే గుణంపోయి బానిసబతుకు అలవడుతుంది. విద్యా వ్యవస్థలో మార్పులంటే కొత్త సిలబస్ కొత్త కోర్సులు కాదు. విద్యార్థుల్లో సమూల మార్పులు రావాలి. వారిలోని చైతన్యం వారు భవిష్యత్తులో పనిచేసే వ్యవస్థలో కొత్త అధ్యాయాలు సృష్టించాలి. నేటి విద్యార్థుల్లో సామాజికస్పృహ నైతిక విలువలు, ప్రపంచ జ్ఞానం, దేశ సమస్యలు, దేశ రాజకీయాలు ఇలాంటి సహజమైన విషయాలు తెలుసుకోలేకపోతున్నారు. ఇవి కొరవడడంతో వ్యవస్థల్లోని లోపాలన్నింటిని ప్రశ్నించి, పోరాడి సాధించే పూర్తి సామర్థ్యం విద్యార్థి కోల్పోతున్నాడు. వీటి అవశ్యకత మళ్లీ వాటి అవసరం వచ్చినప్పుడు మాత్రమే మనకు అర్థం అవుతుంది. అయితే ప్రభుత్వం విద్యార్థి సంఘాలకు విద్యాలయాల్లో ప్రవేశం లేదుఅని ఉత్తర్వులు ఇచ్చింది. ఇది తప్పకుండా ప్రశ్నించే గొంతులను ఉక్కుపాదంతో అణచివేసే చర్య. దీన్ని అన్ని విద్యార్థి సంఘాలు వ్యతిరేకించాయి. ఈ ఉత్తర్వుల వల్ల ప్రైవేట్, విద్యా సంస్థల్లో, ప్రభుత్వ విద్యాలయాల్లో సమస్యలను ప్రశ్నించే గొంతులు లేక విద్యార్థులు విలవిల్లాడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తిచూపే అవకాశం లేకుండాపోయింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే విద్యార్థి సంఘాలను బహిష్కరిస్తే దాని ప్రతిఫలం విద్యార్థులు అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలల్లో రోజురోజుకు ఆత్మహత్యలు, ఫీజుదోపిడీలు, హృదయ విదారక సంఘటనలు కలవరపరుస్తున్నాయి. ప్రైవేట్ వ్యక్తుల కోసం, ప్రభుత్వస్వలాభం కోసం విద్యార్థి సంఘాలకు అనుమతి నివ్వకపోవడం సరైన చర్యకాదు. ప్రస్తుతం సమాజాన్ని, యువతను విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్న శక్తులకు వ్యతిరేకంగా నిలిచి నిత్యం విద్యార్థులతో కలిసి పోరాడగలిగే సత్తా విద్యార్థి సంఘాలకు మాత్రమే ఉంది. కాబట్టి ప్రభుత్వాలు కానీ, బోధించే గురువులు కానీ తమస్వలాభాల కోసం విద్యార్థులను చేతకాని వాళ్లలాగా మార్చకూడదు అని మేధావుల హితవు. గత చరిత్ర చూసుకుంటే విద్యార్థిఉద్యమాలవల్ల సమాజంలోవిద్యావ్యవస్థల్లో ఎన్నోసమూల మార్పులు జరిగాయి. కాబట్టి వీటిని మళ్లీ ఒకసారి స్మరణకు తెచ్చుకుని విద్యార్థులను బానిసత్వ ఆలోచన నుండి బయటకు తెచ్చి స్వతంత్రులుగా మార్చే నైతికబాధ్యత అందరం తీసుకోవాలి. విద్యార్థుల నుండి పుట్టేవారే విద్యార్థి నాయకులు. వాళ్లే రేపటి దేశాన్నినడిపే రాజకీయ నాయకులు కావాలి. ●

# ప్రైవేటీకరణంతో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

జి.సుధాకర్‌రెడ్డి

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా ఆర్థిక అసమానతలు హస్తిమశకాంతరంగా పెరిగినవి. ధనవంతులైన పెట్టుబడిదారులు మరింత ధనవంతులుగా మారుతూ, పేద, మధ్యతరగతి వర్గాలు మరింత పేదరికంలో మగ్గిపోతూ ఆకలి చావులకు ఆత్మహత్యలకు పాల్పడే దురదృష్టకర పరిస్థితులు దాపురించాయి. దేశానికి అన్నంపెట్టే రైతులు తమ పంటలకుఎప్పుడూ గిట్టుబాటు ధరలు లేక అప్పుల బాధలతో ఆత్మహత్యలు, దేశ భావి భారత పౌరులైన విద్యార్థులు కార్పొరేట్ ఫీజుల భారానికి, చదువుల ఒత్తిడికిలోనవుతూ ఆత్మహత్యల పాలవ్వడం యేడాది యేడాదికి పెరిగిపోతున్న నికృష్ట పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేట్ పెట్టుబడి దారులైన కార్పొరేట్ల కబంధ హస్తాలలోకి జారుకున్నాయి. ప్రజా సంక్షేమానికి కృషి చేయాల్సిన రాజకీయ ప్రజాప్రతినిధులు కార్పొరేట్ల సేవలో తరించిపోతూ నమ్మిఓటేసిన ప్రజల పాలిట గుదిబండలుగా మారుతున్నారు. కనీసం ప్రజల మౌలిక సమస్యలను పట్టించుకొనే రాజకీయ నాయకులు ఏ పార్టీలోనూ కనుచూపు మేరలోకనిపించడం లేదు. నిత్యావసర సరుకులు అన్నీ పాలు, పండ్లతోసహా ఆహార పదార్థాలను వదలకుండా కల్తీకి గురై ప్రజలకు రకరకాల రోగాలు పంచే వ్యవస్థ స్థిరపడింది. ఫార్మా కంపెనీలు, మెడికల్ షాప్‌లు, రకరకాల రోగనిర్ధారణ కేంద్రాలు పెంచుకుంటూపోతూ కార్పొరేట్ వైద్యశాలలు రోగుల నుండి లక్షల రూపాయలు ముక్కుపిండి వసూలు చేసే, అమానవీయ వైద్య విధానం కొనసాగుతుంది. సామాన్యునికి మంచి వైద్యం అందనంత ఖరీదు వ్యవహారంగా మారింది. కార్పొరేట్ వైద్యశాలలకు రకరకాల రాయితీల రూపంలో, వివిధ ఆరోగ్య పథకాల పేరున పెద్దపీత వేస్తూ ప్రభుత్వ వైద్యవిధానాన్ని ఉద్దేశ్యపూర్వకంగా నిర్వీర్యం చేసే ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. అంతరాలు లేని వ్యవస్థలకు మూల స్తంభాలైన ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు ప్రైవేటీకరణ మూలంగా సమాజంలో అనేక ఆర్థిక అసమానతలు చోటు చేసుకుంటున్నాయి. విద్య, వైద్యం పేరున ప్రతి అనారోగ్యానికి గురైన కుటుంబం, ఆర్థికంగా నిలువు దోపిడీకి గురవుతూ ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఒకవైపు ఆకలి చావులు, ఆత్మహత్యలు, బలవన్మరణాలు చోటు చేసుకుంటుండగా మరోవైపు కార్పొరేట్ పెట్టుబడిదారులు ప్రపంచ కోటీశ్వరులుగా ఎదగడం అంతరాలు ఏ స్థాయికి చేరుకుంటున్నవో స్పష్టంగా తెలుస్తున్నది. పోషకాహారం లేని బాల భారతం ఒకవైపు, మూడు పూటలా పంచభక్ష పరమాన్నాలతో పుష్టిగా తింటూ అరగక వాకింగ్‌లు, జాగింగ్‌లు, రన్నింగ్‌ల కృత్రిమ వ్యాయామం చేసే వర్గమొకవైపు పెరుగుతుంది. నైతిక విలువలు వందకు వందశాతం నశించి ధన మేరా సర్వస్వం అంటూ అవినీతి అందనంత ఎత్తుకు ఆకాశమంత ఎత్తున అన్నిరంగాల్లో సర్వసాధారణమైపోయింది. ఏ ఒక్క మనిషి మానవీయ విలువలతో తృప్తిగా, సంతృప్తిగా బతికే పరిస్థితిలేదు. అందరూ కూలీల నుండి కోటీశ్వరుల వరకు పనికిమాలిన బిజీబిజీ అర్థరహిత జీవనం గడిపేలా ప్రగతికి దారితీయించినాయి ఎల్‌పిజి సంస్కరణలు. మానవ సంబంధాలు పచ్చి వ్యాపార సంబంధాలుగా మారినాయి. ప్రతివిషయాన్ని ఆర్థికంగా ప్రతి మనిషిని నిలువున దోచుకోవడమే ప్రపంచీకరణ సరళీకరణ, ప్రైవేటీకణ విధానాల ప్రధాన అజెండా. తినే తిండితోపాటు మనిషి చావు పుట్టుకలను వ్యాపారీకరించిన ఘనత లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలదే అన్న సంగతి సగటుమనిషి అర్థం చేసుకోవాలి. పండుగలు పబ్బాలు అన్నీవ్యాపారసంస్కృతిలో భాగంగానే యాంత్రికంగా జరుపుతూ అసలైన పండుగలలోని ఆనందాన్ని అడుగంటించిన ఘనత ఎల్‌పిజి సంస్కరణలదే. వినాయక చవితి లాంటి పండుగల ద్వారా విపరీతమైన విగ్రహాలను నెలకొల్పించి మనుషులను విడదీస్తూ, సౌండ్ పొల్యూషన్, వాటర్ పొల్యూషన్ చేస్తూ ఉచితంగా తాగాల్సిన మంచినీళ్లను అతిపెద్ద వ్యాపారంగా మార్చి శాశ్వతీకరణలో ముందుకు తీసుకెళ్తున్న అత్యంత అమానవీయ ఘనత ఎల్‌పిజి సంస్కరణలదేనన్నది సగటు మనిషికి అర్థమయ్యేదెన్నడో. మంచినీళ్ల అమ్మకానికి ఉపయోగించే ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, ఇతర కంటైనర్‌లు అన్నీప్రకృతి పర్యావరణ కాలుష్యానికి దారితీసేవే. ప్రపంచీకరణ చేస్తున్నచెడుకు అంతులేకుండా పోతుంది. రాసుకునే పెన్నునూ పాలిథిన్ కవర్‌లో ప్యాక్ చేయడం ఎందుకో? తినే ఆపిల్స్‌పై రసాయనపూరిత స్టికర్స్ అంటించి అమ్మే వికృతపోకడలు వక్రమార్గాలు అడుగంటించే నాథులెవరో? కనీసం మంచినీళ్లను ఇంటింటికి ఉచితంగా అందించకుండా అదే మంచినీళ్ల వ్యాపారం పేరున ఇంటింటిని ఆర్థికంగా దోపిడీకి గురిచేస్తున్న ఘనమైన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ సంస్కరణల ప్రజాస్వామ్యదేశం మనది. ప్రజారవాణా వ్యవస్థనురకరకాల ఆంక్షల పేరున నిర్వీర్యం చేస్తూవ్యక్తుల వాహనాలు అధికమొత్తంలో కొనుగోలు జరిగేలాచేస్తూ కాలుష్యం ద్వారా పర్యావరణాన్ని వేడెక్కించే మరోఘనత. సగటు మనిషి సజావుగా జీవనం వెళ్లదీయాలంటే ఎల్‌పిజి లిబరలైజేషన్ ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలను సమూలంగా దూరంచేయడమే కర్తవ్యంగాఎన్నికల మేనిఫెస్టోలో వచ్చేలా రాజకీయ పార్టీలపై ఒత్తిడి చేసి అమలు చేయించాలి. అన్నిరకాల అంతరాలు పెంచుతూ, మానవీయ విలువలను నిలువునపాతరేస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకొమ్ము కాసే రహస్య అజెండాగా కొనసాగుతున్న 1990 అనంతరఎల్‌పిజి సంస్కరణలు దేశంలో సగటు మనిషిని నిర్వీర్యంగా, నిస్సత్తువగా, శిలావిగ్రహంగా, అత్యంత యాంత్రికంగా బతుకు వెళ్లదీసే చెక్కబొమ్మగా మలిచినవి. ధనం కొరకు తనకు తాను సర్వనాశనం చేసుకునే షైలాక్, మిడాస్‌ల సంస్కృతి లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలది. ఇకనైనా చాలించి అంతరాలను పెంచి పోషించే అమానవీయ విషసంస్కృతికి స్వస్తి చెప్పుతూ భారత రాజ్యాంగస్ఫూర్తితో సమానత్వం వైపు దారిదీపంగా మారాల్సిన రాజకీయాల అవసరం ఎప్పుడో వచ్చింది. మేధావులు, కవులు, రచయితలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, రచయితలు, ఉపాధ్యాయుల మేల్కొని ప్రజలను చైతన్యపరుస్తూ అన్ని రకాల అంతరాలను అంతం చేసే పాలనకు పునాది వేసే రాజకీయాలను నడిపించేలా కృషి చేయాలి. ●

# ఈ సీజన్‌లో లక్షల సంఖ్యలో వివాహాలు

## రూ.4.25 లక్షల కోట్లకుపైగా వ్యాపారం
## తెలుగు రాష్ట్రాల్లో 4.05 లక్షల పెళ్లిళ్లు

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ప్రస్తుతం పండుగలు, తదుపరి రానున్న పెళ్లిళ్ల సీజన్లలో ఆర్థిక లావాదేవీలు జోరందుకోనున్నాయి. పెళ్లిళ్ల సీజన్ నవంబరు నెల 23 నుండి డిసెంబరు 15వ తేదీ వరకూ కొనసాగనుంది. ఈ పెళ్లిళ్ల సీజనులో దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో వివాహాలు జరుగుతాయని అంచనా. పెళ్లిళ్ల షాపింగ్ నుండి నిత్యావసర సేవల వరకూ ఈ సీజనులో 5.40 లక్షల కోట్ల రూపాయల మేర లావాదేవీలు జరుగుతాయని అంచనా. ఒక్క తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 4.05 లక్షల వివాహాలు జరిగే వీలుందని, తద్వారా 51 వేల కోట్ల రూపాయల మేర సొమ్ము చేతులు మారనుంది. వీటికీ సంబంధించి ఇప్పటికే బాంక్వెట్ హాళ్లు, హోటళ్లు, ఓపెన్ లాన్‌లు, కమ్యూనిటీ సెంటర్లు, పబ్లిక్ పార్కులు, ఫామ్ హౌస్‌లు, వివాహాల కోసం అనేక రకాల స్థలాలు దేశ వ్యాప్తంగా పూర్తిగా సిద్ధం చేస్తున్నారు. ప్రతీ పెళ్లిలో ఉపకరణాల కొనుగోలుతో పాటు, టెంట్, డెకరేటర్‌లు, ఫ్లవర్ డెకరేషన్‌లు, క్రాకరీ, క్యాటరింగ్ సర్వీస్, ట్రావెల్ సర్వీస్, క్యాబ్ సర్వీస్, ప్రొఫెషనల్ గ్రూప్‌లు, కూరగాయల విక్రయదారులు, ఫొటోగ్రాఫర్‌లు, వీడియోగ్రాఫర్ వంటి అనేక రకాల సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. అలాగే బ్యాండ్ బాజా, షెహనాయి, ఆర్కెస్ట్రా, డీజే, ఊరేగింపు కోసం గుర్రాలు, బండ్లు, కార్లు, లైట్లు ఇలా అనేక ఇతర రకాల సేవలు ఈ సారి పెద్ద ఎత్తున వ్యాపారం చేసే అవకాశం ఉంది. దీంతోపాటు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కూడా పెద్ద వ్యాపార అవకాశంగా మారిందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మేరకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (క్యాట్) రూపొందించిన డేటా ప్రకారం సిఎటి పరిశోధనా విభాగం రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఇటీవల దేశంలోని 20 ప్రధాన నగరాల వ్యాపారులు, సర్వీస్ ప్రొవైడర్లలో ఒక సర్వే నిర్వహించింది. ఈ సీజనులో రాజధాని ఢిల్లీలో 3.5 లక్షలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని, వీటి కారణంగా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర వ్యాపారం జరిగే వీలుందని తేలింది. గత ఏడాది దేశ వ్యాప్తంగా ఇదే పెళ్లిళ్ల సీజనులో దాదాపు 32 లక్షల వివాహాలు జరగ్గా, 3.75 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేశారు. అదే ఈ ఏడాది జరిగే పెళ్లిల్లో దాదాపు 6 లక్షల పెళ్లిళ్లలో ఒక్కో దానికి 3 లక్షల రూపాయలు ఖర్చవుతుందని అంచనా. 10 లక్షల పెళ్లిళ్లలో ఒక్కో వివాహానికి 6 లక్షల రూపాయలు, 12 లక్షల పెళ్లిళ్లలో ఒక్కో దానికి 10 లక్షల రూపాయలు, 6 లక్షల పెళ్లిళ్లలో ఒక్కో వివాహానికి 25 లక్షల రూపాయలు, మరో 1.10 లక్షల వివాహాల్లో ఒక్కోదానికి 50 లక్షల రూపాయలు, 60 వేల వివాహాలకు కోటి రూపాయలు అంతకంటే ఎక్కువ ఖర్చు చేస్తారని లెక్కకట్టారు.



గురువారం రాత్రి హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న హవాలా నగదు

# రూ.1.78 కోట్ల హవాలా నగదు పట్టివేత

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ హవాలా నగదు పట్టుబడడం ఆగడం లేదు. ఇప్పటికే 120 కోట్ల రూపా యలకుపైగా నగదు పట్టుబడగా తాజాగా గురువారం రాత్రి గుడిమల్కాపూర్ వద్ద రెండు కార్లలో తరలిస్తున్న కోటీ 78 లక్షల 30 వేల రూపాయల నగదును పోలీసులు జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను దక్షిణ, పశ్చిమ మండల డిసిపి బాలస్వామి శుక్రవారం మీడియాకు వెల్లడించారు.
గురువారం రాత్రి గుడిమల్కాపూర్ రోడ్‌పై ఆసిఫ్‌నగర్ డివి జన్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక ఇన్నోవా కారు (నంబర్ ఎపి 09 బిఈ 6181), ఓమ్ని కారు (నంబరు ఎపి 13 ఎఎఫ్ 2757) అనుమానాస్పదం గా వేగంగా వచ్చాయి. ఈ రెండు కార్లను ఆపి సోదా చేయగా వీటిలో కోటీ 78 లక్షల 30 వేల రూపాయల నగదు పట్టుబడింది. రెండు కార్లలో వున్న మహమ్మద్ షా నవాజుద్దీన్ (43), మహమ్మద్ షాబుద్దీన్ (40) (వీరిద్దరు షేక్‌పేట్ వాసులు, ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు)లు ఈ నగదుకు సంబం ధించి ఎలాంటి ఆధారాలు చూపించలేక పోయారు. దీంతో ఈ నగదును ఐటి శాఖకు మధ్యవర్తుల పంచనామా మధ్య పోలీసులు అప్పగించారు. ఆసిఫ్‌నగర్ ఎసిపి రాజా వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ఈ వాహనాల తనిఖీలు జరిగాయి. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.

# ధరణి పేరుతో తెలంగాణలో కుంభకోణం

● కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కోదండరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ధరణిపేరుతో తెలంగాణలో అధికారికంగా పెద్ద కుంభకోణం జరిగిందని రైతుబంధు అడ్డుకుంటున్నామని బిఆర్ఎస్ కుట్రపూరితంగా ప్రచారం కొనసాగిస్తున్నదని కిసాన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కోదండరెడ్డి ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో వున్నా ప్రతిపక్షంలో వున్నా చట్టాలను గౌరవిస్తుందని అధికార దుర్వినియోగం చేయదని ఆయన అన్నారు. రైతుబంధు విషయంలో బిఆర్ఎస్ నాయకులు మాటలు హద్దులు దాటుతున్నాయని అన్నారు. రైతు బంధు పథకం కాంగ్రెస్ 2014లో వేరే పేరుతో పెట్టిందని ఆయన గుర్తుచేశారు.
రాజశేఖర్‌రెడ్డి హయాంలో వ్యవసాయానికి ఉచిత కరెంటు ఇచ్చాం. రైతుకు ఋణాలు మాఫీచేశాం. రైతుకు కనీస మద్దతు ధర ఇచ్చాం. మేము లిస్టులో లేని పంటలు కూడా కొనుగోలు చేశాం. మీరు పంటలు కొనడంలేదు. నెలల తరబడి రైతును మార్కెట్‌లలో వేచి వుండేలా చేశారు. రైతులు మరణిస్తున్నారు. పాలకేంద్రంకు కోళ్ళ పరిశ్రమల అభివృద్ధికి మేం కృషిచేశాం, 78కోట్ల రుణమాఫీ చేశాం అని ఆయన గుర్తుచేసుకున్నారు. ఏఐసిసి జాతీయ ప్రతినిధి రమణి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అయోధ్యరెడ్డి, కమలాకర్, నిజామొద్దిన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

### నీళ్లు, నిధులు, నియామకాలు ఏవని తెలంగాణ ప్రశ్నిస్తుంది? ఎఐసిసి మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని అయితే ఇక టిఆర్ఎస్‌ను మాత్రం ప్రతి రోజు మేం నీళ్ళు నిధులు, నియామకాలు ఏవని బిఆర్ఎస్‌ను ప్రశ్నిస్తామని ఏఐసిసి మీడియా ఇంచార్జ్ అజయ్ కకుమార్, రోహన్ గుప్తా, వార్ రూమ్ ఇంచార్జ్ రమణి, ఏఐసిసి మీడియా కోఆర్డినేటర్ చామల కిరణ్ కుమార్‌రెడ్డిలు తెలిపారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజల్లో మంచి స్పందన వుంది. 30రోజుల్లో 30 ప్రశ్నలను బిఆర్ఎస్‌ను అడుగుతాం. ఆరు గ్యారెంటీలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని తెలిపారు.

## పిల్లలకు ట్రిబ్యునల్ ఏర్పాటుపై పరిశీలన : ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

### జవహర్ బాల్ మంచ్ ప్రతినిధులతో మేనిఫెస్టో కమిటీ భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** పిల్లల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ఒక ప్రత్యేక పిల్లల ట్రిబ్యునల్ ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జవహర్ బాల్ మంచ్ ప్రతినిధులతో మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు సమావేశమైనారు. ఈ సందర్భంగా పిల్లల సమస్య పరిష్కారం, సంరక్షణ కోసం ప్రత్యేక ప్రతిపాదనలు చేయాలని జవహర్ బాల్ మంచ్ తెలంగాణ రాష్ట్రచైర్మన్ మామిడి రిషికేశ్‌రెడ్డి కోరారు. ప్రైవేటు పాఠశాలలో ఏక రూపకతతో ఫీజులు వుండాలని రిషికేశ్‌రెడ్డి సూచించారు. మధ్యాహ్న భోజనం పథకం మీద ప్రభుత్వం నియంత్రణ పర్యవేక్షణ ఉండాలని ఔట్‌సోర్స్ ఏజన్సీలపై భారం మొత్తం మోపడం వల్ల నాణ్యత లోపం వుంటుందని వివరించారు. మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు స్పందిస్తూ కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన ఆరుగ్యారెంటీలలో యువవికాసం పథకం అద్భుతమైందని ప్రతి మండలంలో ఒక పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక స్కూల్ నిర్మిస్తామని తెలిపారు. కెజిబివి గురుకుల పాఠశాలలు అరకొర వసతులతో కిరాయి భవనాలలో నడుస్తున్నాయని తక్కువ వేతనాలతో కాంట్రాక్టు పద్దతిలో ఉపాధ్యాయులు నియామకం జరగడం వల్ల ఆశించిన ఫలితాలు కూడా రావడంలేదు. మన ఊరు మనబడి మనబస్తీ కార్యక్రమం నత్తనడకన నడుస్తున్నాయి.
12రకాల మౌళిక వసతులు కల్పిస్తామని అట్టహాసంగా మనవూరు మనబడి కార్యక్రమం చేపట్టారు. 2,497 కోట్లతో 9123 పాఠశాలలను అభివృద్ధి పరుస్తామని లక్ష్యం పెట్టుకొంటే 2023 ఫిబ్రవరి వరకు 1240 పాఠశాలలో మాత్రమే వసతులు పూర్తి చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగాలేని కారణంగా పౌష్టికాహార లోపం సర్కార్ తిండితో ఏర్పడుతోందని పిల్లలు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఎదిగేందుకు చర్యలు తీసుకొనేందుకు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
పిల్లలను శారీరకంగా మానసికంగా ఎవరైనా పీడిస్తే వారి పట్ల వెంటనే చర్యలు తీసుకోవాలి. పిల్లల సమగ్రఅభివృద్ధికి సంక్షేమపథకాలు అమలు చేస్తూనే వారికి న్యాయపరమైన అంశాలలో వెంటనే పరిష్కారాలు ఇవ్వడానికి ట్రిబ్యునల్ ఏర్పాటు కు పరిశీలన చేస్తాంఅని ఆయన హామి ఇచ్చారు.

# తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని సంక్షేమ పథకాలను బేరీజు వేసుకోండి

## రైతన్నా ఏది కావాలో ఆలోచించుకో.. మంత్రి కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర రైతులను ఉద్దేశిస్తూ మంత్రి కెటిఆర్ ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, కర్ణాటకలో కాంగ్రెస్ అమలుచేస్తున్న రైతు సంక్షేమాలను బేరీజు వేస్తూ, ఏది కావాలో ఎంచుకోవాలని మంత్రి కెటిఆర్ సూచించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. కెసిఆర్ ఇస్తున్న 24గంటల విద్యుత్ కావాలా? కర్ణా టకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఐదు గంటల విద్యుత్ కావాలా? లేదంటే తెలంగాణలో కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పిన మూడు గంటల విద్యుత్ కావాలా? రైతుబంధు, రైతు బీమా ఇచ్చి ప్రాజెక్టు కట్టిన కెసిఆర్ కావాలా? ఆర దశాబ్దాలు ఆగం చేసిన వాళ్లు కావాలా? నెర్రెల బారిన నేలను సస్యశ్యామలం చేసిన కెసిఆర్ కావాలా? ఏదీ కావాలి మనకు? ఆలోచించు రైతన్నా అంటూ మంత్రి కెటిఆర్ ట్వీట్ చేశారు.

# సెల్‌ఫోన్ చోరీలు, మిస్సింగ్ కేసుల విచారణలో మొదటి స్థానంలో తెలంగాణ

## సిఇఐఆర్ పోర్టల్‌తో 39శాతం ఫోన్ల రికవరీ

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** సెల్‌ఫోన్‌ల చోరీలు, మిస్సింగ్ కేసుల విచారణలో, బాధితులకు న్యాయం చేకూర్చడంలో తెలంగాణ సిఐడి విభాగం దేశంలోనే మొదటి స్థానంలో సాధించి మరోసారి అగ్రభాగాన నిలిచింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహకారంతో దేశ వ్యాప్తంగా ఏర్పాటైన సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సిఈఐఆర్)ను వాడి గడచిన 189 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10,018 సెల్‌ఫోన్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని బాధితులకు అందచేశారు. ఇందులో వెయ్యి ఫోన్లు కేవలం 14 రోజుల్లో నిందితుల నుంచి జప్తు చేసి బాధితులకు అందజేశారు. కాగా సెల్‌ఫోన్ల చోరీ కేసుల విచారణ, ఫోన్ల జప్తు విషయంలో కర్నాటక 36 శాతంతో ద్వితీయ స్థానం, ఆంధ్రప్రదేశ్ 30 శాతంతో తృతీయ స్థానంలో వున్నాయి. సెల్‌ఫోన్ చోరీలు, మిస్సింగ్ కేసులను తీవ్రంగా పరిగణించిన కేంద్రం ఈ తరహా కే సులను వేగంగా పరిష్కరించేందుకు సిఈఐఆర్‌ను ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రారంభించడం తెలిసిందే. దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 31 పోలీసు యూనిట్లలోని 780 పోలీసు స్టేషన్లకు సిఈఐఆర్ యూజర్ ఐడిలను ఈ ఏడాది ఏప్రిల్ 18వ తేదీన అందజేయడం విదితమే. ఈ సందర్భంగా అన్ని పోలీసు స్టేషన్లలో ఎంపిక చేసిన వారికి దీని అమలుకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. కాగా సిఈఐఆర్ పోర్టల్‌కు రాష్ట్ర వ్యాప్త నోడల్ అధికారిగా సిఐడి చీఫ్ మహేష్ భగవత్ వ్యవహరి స్తున్నారు. ఈ పో ర్టల్ అమలు వల్ల ఇప్పటి వరకు సిఈఐఆర్ పోర్టల్ అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 86,395,219 సెల్ ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ అయినట్లు గుర్తించారు. ఇం దులో గుర్తించేందుకు అవకాశం వున్నవి 25,598గా తేలింది. ఇదే సమయంలో 10.018 ఫోన్లను ఆయా ప్రాంతాలలో స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. మొత్తం మీద సిఈఐఆర్ పోర్టల్ అమలులో భాగంగా సెల్‌ఫోన్ చోరీ లేదా మిస్సింగ్ కేసుల పరిష్కారం 39 శాతంగా వుంది. మొత్తం సెల్‌ఫోన్ రికవరిలో సైబరాబాద్ లో 1428 వుండగా, హైదరాబాద్‌లో 1206, రాచకొండలో 912గా వుంది. కాగా సిఈఐఆర్ పోర్టల్ రాష్ట్రంలో సమర్థవంతంగా అ మలులో సిఐడి సైబర్ క్రైం ఎస్‌జెపి ఎస్‌పి లావణ్య, డిడిజి సెక్యూరిటీ శ్రీనివాసరావు, డైరక్టర్ యశేంద్ర కుమార్ బన్సాద్, అదనపు డైరక్టర్ రాఘవరెడ్డి కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలో సిఈఐఆర్ పోర్టల్ పక్కాగా అమలవుతున్నందుకు సిఐడి అదనపు డిజి మహేష్ భగవత్ సిఐడి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# వెయ్యికోట్లతో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు గంగు కృష్ణచైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య, రమణారావు తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి వెయ్యికోట్లతో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు గంగు కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణజాతిలోని అన్ని శాఖల వారికి ఒకేతాటిపైకి తెచ్చేందుకు, బ్రహ్మణుల స్థితిగతులు మెరుగుపరచాలన్న లక్ష్యంతో 2015లో దివంగత గంగుబానుమూర్తి దీన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈనేపథ్యంలో ఆయన ఆశయాలకు అనుగునంగా బ్రాహ్మణ పరిషత్ ముందు సాగుతుందన్నారు. ముఖ్యంగా బ్రాహ్మణులకు పౌరహిత్యం కుల వృత్తిగా ప్రకటించాలని, కరుణీక వ్యవస్థ పునరుద్ధరించాలన్నారు.
అలాగే బ్రాహ్మణ పరిషత్ విదివిధానలు బహిర్గతం చేయాలని సంక్షేమ పరిషత్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణుల కులగణన తక్షణమే నిర్వహించాలన్నారు. అలాగే అన్నిపార్టీలు బ్రాహ్మణ సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలను తమ మానిఫెస్టోలో ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పోచంపల్లి రమణారావు, బిన్నూరి ప్రశాంత్, గోబ్బురు శైలజ, డి.శిరీష ఫణికుమార్, రాధిక, మోహన్‌రావు, రఘుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్మలంటే లోకువా? నాలుగు బిస్కెట్లు వేస్తే ఊర్కుంటామా?

## కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి ఆగ్రహం

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** కాంగ్రెస్ తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసే వాతావరణం వుందని,. ఇలాంటి సమయంలో మనవేలుతో మనం మన కన్ను పొడుచుకోవద్దని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి తెలిపారు. శుక్రవారం నాడు ఆమె ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.
కాంగ్రెస్ టిక్కెట్ల జాబితాలో కమ్మలకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.
ఏం కమ్మలంటే అంతలోకువా ? నాలుగు బిస్కట్లు వస్తే ఊర్కుంటుమా? అని ప్రశ్నించారు. ఇతర పార్టీలు టికెట్లు, ఆర్థిక వనరులు కల్పిస్తామని అంటే కూడా పోకుండా, కాంగ్రెస్ వైపు వచ్చినందుకు పిల్లికి బిచ్చం వేసినట్లు సీట్లు కేటాయించడం ఏంటని ఆమె ప్రశ్నించారు.

# రిజిస్ట్రేషన్ల ద్వారా ఖజానాకు రూ.7,104 కోట్ల రాబడి

● ఆర్థిక శాఖ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల అమ్మకం ద్వారా ఇప్పటి వరకూ 7,103.80 కోట్ల రూపాయల మేర ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరింది. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 18,500 కోట్ల రూపాయల మేర ఆదాయం వస్తుందని అంచనా బడ్జెట్‌లో రాష్ట్ర సర్కార్ పేర్కొంది. ఇందులో ఇంత వరకూ 10.66 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగి తద్వారా 38 శాతం మేర 7,103.80 కోట్ల రూపాయలు సమకూరినట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. నెలల వారీగా చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో వ్యవసాయ రిజిస్ట్రేషన్ల ద్వారా 149 కోట్ల రూపాయలు, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా 851 కోట్ల రూపాయలు, మేలో 160.44 కోట్ల రూపాయలు, 963.13 కోట్ల రూపాయలు, జూన్‌లో 162 కోట్ల రూపాయలు, 942.15 కోట్ల రూపాయలు, జూలైలో 145.13 కోట్ల రూపాయలు, 851.58 కోట్ల రూపాయలు, అగస్టులో వ్యవసాయేతర రిజిస్ట్రేషన్ల ద్వారా 966.07 కోట్ల రూపాయలు, సెప్టెంబరులో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా 158 కోట్ల రూపాయలు, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా 958.31కోట్ల రూపాయలు రాబడి వచ్చింది. అలాగే ఈ నెలలో 20వ తేదీ వరకూ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లపై 1,009.36 కోట్ల రూపాయలు, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేష్ల ద్వారా 6,123.73 కోట్ల రూపాయల చొప్పున ఆదాయం లభించినట్లు ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు.

# మేడిగడ్డ బ్యారేజ్ నష్టానికి సిఎం కెసిఆర్ పూర్తి బాధ్యత వహించాలి

● మావోయిస్టు జెఎండబ్ల్యుపి డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్

**జమ్మికుంట, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గడిచిన 10 సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజానికానికి చేసిన అభివృద్ధి కన్న ముఖ్యమంత్రి కేసిఆర్ కుటుంబమే అన్ని విధాల బాగుపడిందని, అందులో భాగంగానే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన సంఘటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పూర్తి బాధ్యత వహించాలని మావోయిస్టు పార్టీ జయశంకర్ భూపాలపల్లి- మంథని- వరంగల్- పెద్దపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేష్ శుక్రవారం విలేకరులకు పంపిన ఒక లేఖలో డిమాండ్ చేసారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మి బ్యారేజ్ అంతరాష్ట్ర వంతెన 19,20,21వ పిల్లర్ల మధ్య 30మీటర్ల పొడవున వంతెన కుంగిపోయిన విషయం అందరికి తెలిసిందేనన్నారు. రాష్ట్ర ప్రజల ప్రజాధనం వేలకోట్ల రూపాయలు ఖర్చుచేసి, మేడిగడ్డ బ్యారేజ్‌ని ఎల్ఎన్‌టి సంస్థ నిర్మించి కేవలం మూడు సంవత్సరాలు అయిందని, దీన్ని 2016 మే 2వ తేదిన నిర్మాణం చేపట్టి 2019 జూన్ 21న దీన్ని ప్రారంభించారని మావోయిస్టు నేత తన లేఖలో పేర్కొన్నారు.
ఈ బ్యారేజ్ అనతికాలంలోనే కూలిపోవడానికి కారణం ముఖ్యమంత్రి కేసిఆర్ కుటుంబం పెద్ద మొత్తంలో కమీషన్లు తీసుకోవడంతో ప్రాజెక్టు నిర్మాణం నాసిరకంగా నిర్మించడం జరిగిందన్నారు. ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలోనే అనేక చోట్ల దానికి పగుళ్లు ఏర్పడ్డాయని, ఈ విషయం బయటకు రాకుండా.. ఈ ప్రపంచానికి తెలియకుండా ప్రజలను, ప్రజాసంఘాలను, బూర్జ్వా రాజకీయ పార్టీలను సైతం ప్రాజెక్టు దరిదాపుల్లో రానివ్వకుండా పోలీస్ ఫోర్స్‌ను పెట్టి ముందస్తుగా అరెస్టులు చేసి ధర్నాలు చేయకుండా, ర్యాలీలు చేయకుండా విషయం బయటకు రాకుండా పాలక ప్రభుత్వం అనిచివేసిందని వెంకటేష్ తన లేఖలో దుయ్యబట్టారు. చివరకు ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛను కూడా కాలరాస్తూ మీడియాను బెదిరించి కంట్రోల్ చేసారని వెంకటేష్ తన లేఖలో ఆరోపించారు. ఆంధ్ర పాలకులు, పెద్ద మనుషుల ఒప్పందంలో ఆంధ్రలో కలుపుకుని, తెలంగాణ నీళ్లు, నిదులు, నియమకాలతో పాటు వనరులన్నింటిని దోపిడి చేయడంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని సబ్బండ వర్గాల ప్రజలు పోరాడి, వేలాది మంది ప్రాణ త్యాగం చేసి తెలంగాణ సాధించుకున్న విషయాన్ని మావోయిస్టు నేత వెంకటేష్ తన లేఖలో వివరించారు. తెలంగాణను సాధించుకున్నప్పటికి మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్‌తో పాటు ఇతర నిర్మాణాలు సైతం ఆంధ్ర కాంట్రాక్టులకు ఇచ్చి అందినంతగా కమీషన్లు దండుకున్నారని తన లేఖలో ఆరోపించారు. ఈ బ్యారేజ్ నిర్మాణానికి ప్రజల పంటపొలాలను, సాగుభూములన్నింటని నయాన, భయాన, లొంగదీసుకుని, బలవంతంగా భూములు లాక్కున్నారని, ఆ ప్రాంత స్థానికులకు అక్కడ న్యాయం జరగలేదన్నారు. తెలంగాణ ప్రజల కష్టార్జితంతో భారీ హంగులు, ఆర్భాటాలతో బ్యారేజ్ నిర్మించామని, కోటి ఎకరాలకు నీళ్లు అందిస్తున్నామని చెప్పుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలు దగ్గర పడడంతో ఒక లక్ష రూపాయల రుణమాఫీ చేసారు కానీ, రైతుల అప్పులు తీరలేదని, రైతుల ఆత్మహత్యలు ఆగలేదని వెంకటేష్ తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణమైన నాసిరకం ప్రాజెక్టులకు పూర్తి బాధ్యత కేసిఆర్ కుటుంబానిదేనని వెంకటేష్ తన లేఖలో హెచ్చరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య తదితరులు

# మాలలపై పార్టీల వివక్ష తగదు : జి.చెన్నయ్య

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మాలలపై వివక్షను ప్రదర్శిస్తున్నాయని మాలలను అణగదొక్కాలన్న కుట్రలతో ఎస్సీ వర్గీకరణ చేస్తామని అంటున్నాయని మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మాల పోరాట సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలను చైతన్య పరిచేందుకు 29నుంచి గ్రేటర్‌లో బస్తీబాట చేపడతున్నట్లు ప్రకటించారు. ఎస్సీ కులాల లెక్కలపై సర్వే నిర్వహించాలని, అందులో వెనకబడిన కులాలను గుర్తించి ప్రత్యే అబివృద్ధి పథకాలను ప్రవేశపెట్టాలన్నారు. అలాగే ఎస్సీల రిజర్వేషన్ కోటాను 20శాతానికి పెంచాలని, ప్రతి జిల్లాలో మాల ఆత్మగౌరవ భవనం నిర్మాణం కోసం ఐదెకరాల స్థలం, 3కోట్ల నిధులు కేటాయించాలన్నారు.
కేంద్రం అమలు చేసిన మహిళా రిజర్వేషన్లలో ఎస్సీ మహిళల వాటా తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సమితి నాయకులు బూర్గుల వెంకటేశ్, రమేష్‌బాబు, మన్నెరంగా, మారుతి, కరణం కిషన్ తదితరులు పాల్గొన్నారు.



డబ్బులు స్వాధీనపర్చుకున్న పోలీసులు

## తనిఖీల్లో పట్టుబడుతున్న ఆధారాల్లేని నగదు

### కొత్తూరులో రూ.7లక్షలు స్వాధీనం

**కొత్తూర్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని జెపి దర్గా రోడ్డు వద్ద ఆకస్మికంగా వాహన తనిఖీ చేస్తుండగా కొత్తూర్ నుండి జేపీ దర్గా వైపు అను మానస్పందంగా వస్తున్న స్కూటీనీ ఆపి తనిఖీ చేయగా వాహనంలో రూ.7 లక్షల ఉన్నాయి. రంగాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌శాస్త్రిగా గుర్తించారు. రూ.7 లక్షలకు ఎటువంటి ఆధారములు చూపించకపోవడంతో 7లక్షలను ఎన్నికల నియమ నిబంధనల మేరకు స్వాధీనపర్చుకుని జిల్లా గ్రివెన్స్ కమిటీకి పంపడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ కె.శంకర్‌రెడ్డి తెలిపారు.

### బొంరాస్‌పేటలో 5 లక్షలు సీజ్

**బొంరాస్‌పేట్:** రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిబంధనలను ఉల్లంగిస్తూ ఇతం పార్టీల నాయకులు, నేతలను ప్రలోభపెట్టేందుకు 5లక్షల నగదుతో పట్టుబడిన వ్యక్తిని అరెస్టుచేసి కారును సీజ్ చేసినట్లు పరిగి డిఎస్‌పి కరుణాసాగర్‌రెడ్డి తెలిపారు. కొడంగల్ సిఐ రాములుతో కలిసి మీడియా సమావేశంలో సంఘటనకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొంరాస్‌పేట్ మండలం వడిచర్ల గేట్‌దగ్గర పోలీస్‌లు నిర్వ హించిన తనిఖీలలో ఎన్నె మీదితాండకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దాక్యనాయక్ మండల పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రలోభపెట్టేందుకు 5లక్షల నగదును తరలిస్తున్నట్లు స్క్వాడ్‌వచ్చిన ఫిర్యాదే మేరకు బొంరాస్‌పేట్ ఎస్ఐ శంకర్ తమ సిబ్బందితో కలిసి వడిచర్ల గేట్ దగ్గర తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో ఎన్నికల నిబంధనలను ఉల్లగిస్తూ తన కియా కారులో 5లక్షల రూపాయాల నగదును పట్టుకోని ఎంసిసి యాక్టు ప్రకారం అరెస్టు చేసి నగదు,కారును సీజ్ చేయడం జరిగిందని డిఎస్‌పి కరుణాసాగర్ తెలిపారు.

## సిఎం సభకు వస్తూ ట్రాక్టర్ బోల్తా

### ప్రమాదంలో ఒకరి మృతి

### ఇద్దరి పరిస్థితి విషమం

**ప్రభాతవార్త, ఖమ్మం:** శుక్రవారం బీఆర్ఎస్ చేపట్టిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతూ ఓ ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటన విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఓ మహిళ మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కూసుమంచి మండల పరిధిలోని గైగోళ్ళపల్లి గ్రామానికి చెందిన 26 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి సభకు ట్రాక్టర్లలో బయలుదేరగా నానుతండా సమీపంలోకి రాగానే ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది.

ఈ ఘటనలో అల్లి సూరమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. కాగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి ఆమె కుటుంబ సభ్యులకు తక్షనమే ఆసుపత్రి వద్ద పది లక్షల రూపాయలు అందజేసి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. తన గెలుపు కోసం జరిగే సభకు వస్తున్న కార్యకర్తలు ప్రమాదానికి గురి కావడం తనకు ఎంతో బాధ కలిగిందని ఉపేందర్‌రెడ్డి అన్నారు.

మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన ప్రకటించారు. కూసుమంచి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిబంధనల అమలులో నిర్లక్ష్యం.. మరో పోలీసు అధికారిపై వేటు

### త్వరలో మరికొందరిపైనా చర్యలు?

### ట్రైకమిషనరేట్లలో ఆరుగురు ఐపిఎస్‌ల బదలీ?

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నికల నిబంధనల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఎన్నికల సంఘం మరో పోలీసు అధికారిపై వేటు వేసింది. ఇప్పటికే హైదరాబాద్ కమిషనర్‌గా పనిచేసిన సి.వి ఆనంద్‌తో పాటు నిజామాబాద్, వరంగల్ కమిషనర్లు సత్యనారాయణ, రంగనాథ్‌ల సహా ఇంకొందరు ఎస్ పిలను ఎన్నికల సంఘం మూడు వారాల క్రితం బదిలీ చేయడం తెలిసిందే. వీరి స్థానాల్లో కొత్త వారిని నేరుగా ఐపిఎస్ అధికారులుగా నియమితులైన వారిని నియమించడం విదితమే. ఈ ఘటన తరువాత మరికొందరు పోలీసు అధికారులపైనా కాంగ్రెస్, బిజెపి నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా రెండవ దఫాగా ఇద్దరి పై వేటు పడింది. ఇక మూడవ దఫాగా శుక్రవారం నాడు కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా గత జనవరి నెలలో విధుల్లో చేరిన సుబ్బారాయుడును ఎన్నికల సంఘం బదిలీ చేసింది. మూడు వారాల వ్యవధిలో డిజి స్థాయిలో పనిచేసిన హైదరాబాద్ పోలీసు కమిషనర్ ఆనంద్‌తో పాటు డిఐజి స్థాయిలోని అధికారులు సత్యనారాయణ, రం గనాథ్, ఎస్పి స్థాయిలో పనిచేసిన సుబ్బరాయుడు సహా మరికొందరు బదిలీ వేటుకు గురయ్యారు. మరోవైపు జంట నగరాలు, శివార్లలో విస్తరించి వున్న హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో మరో ఆరుగురు ఎస్‌పి స్థాయి అధికారులను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం అయినట్లు సమాచారం. వీరిపై కాంగ్రెస్‌తో పాటు బిజెపి నాయకులు ఇప్పటికే పలుమార్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం గమనార్హం. వీరంతా చాలాకాలంగా ఒకేచోట విధులు నిర్వహించడంతో ఈ ఫిర్యాదులను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్లుగా తెలిసింది. దీనిపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిన పక్షంలో ట్రై కమిషనరేట్ల పరిధుల్లో పనిచేస్తున్న ఇంకొంద రు బదిలీ అయ్యే వీలుంది.

## కమాండ్ కంట్రోల్‌ను సందర్శించిన విదేశీ ప్రతినిధులు

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖకు తలమానికంగా వున్న కమాండ్ కంట్రోల్‌ను విదేశీ ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. 25 దేశాలకు చెందిన 37 మంది ప్రతినిధులు కొంతకాలంగా భారత్ లో పర్యటిస్తూ ఆయా రాష్ట్రాలలో అమలవుతున్న ఈ గవర్నెన్స్ తీరుతెన్నులను అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా ఆ బృందం తెలంగాణ పర్యటనకు వచ్చిన క్రమంలో కమాండ్ కంట్రోల్‌ను సందర్శించింది. ఈ బృందానికి పరిపాలనా విభాగం జాయింట్ సిపి పరిమళ హన్నా నూతన్ స్వాగతం పలికారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూం విశిష్టతను, ఇక్కడ వున్న సర్కారీ విభాగాలు, వాటి పనితీరును పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. దీంతో పాటు పోలీసు శాఖ వాడతున్న టెక్నాలజిని, తెలంగాణలో వున్న సిసి టివిలను, వాటి వల్ల ఒనగూరుతున్న ప్రయోజనాలను కూడా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్ ఎస్‌పి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్‌ను సందర్శించిన విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతున్న పరిపాలనా విభాగం జాయింట్ సిపి పరిమళ హన్నా నూతన్.

## మూడు గంటలు బతిమిలాడింది మరిచావా?

### పాలేరులో నా ఓటమికి కారకులెవరో మీ అంతరాత్మకు తెలియదా?

### నీ కొడుకే నన్ను ఓడించింది నిజం కాదా?

### సిఎం కెసిఆర్ వ్యాఖ్యలపై మాజీమంత్రి తుమ్మల ఫైర్

**ప్రభాతవార్త ప్రతినిధి, ఖమ్మం:** ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ జెండా పట్టే కార్యకర్త లేని సమయంలో తన దగ్గరకు వచ్చి మూడు గంటల పాటు బ్రతిమిలాడి పార్టీలోకి ఆహ్వానించిన విషయం కేసీఆర్ మరిచిపోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి తుమ్మల అన్నారు. పాలేరు సభలో తనను ఉద్దేశించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి తుమ్మల ఓ ప్రకటన ద్వారా ఘాటుగా స్పందించారు. మీ ఆహ్వానం మేరకే 250 మంది సర్పంచ్‌లతో, వేలాది మంది కార్యకర్తలతో టీఆర్ఎస్‌లో చేరానని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తాను టీఆర్ఎస్‌లో చేరక ముందు ఉమ్మడి జిల్లాలో ఒక్క కొత్తగూడెంలో మాత్రమే గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. తన మిత్రుడైన పువ్వాడ అజయ్‌కుమార్‌ను మంత్రిని చేయాలన్న దురుద్దేశ్యంతో నీ కొడుకు కేటీఆరే నన్ను ఓడించింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. నీ కొడుకే నా ప్రత్యర్థికి డబ్బులిచ్చిన విషయం తెలిసి కూడా మీరు ఏమీ చేయలేక అచేతనంగా ఉండిపోయిన విషయం మీ అంతరాతనమకు తెలియదా అని ప్రశ్నించారు. 40 సంవత్సరాల మన ఇద్దరి స్నేహంలో నీవేంటో నా నిబద్దత ఏంటో తెలిసి కూడా నిండు సభలో వచ్చి అబద్దాలు మాట్లాడటాన్ని మీ విజ్ఞతకే వదిలేస్తున్నానంటూ హితవు పలికారు. ఎవరి నిబద్దత ఏమిటో ఖమ్మం జిల్లా ప్రజలకు తెలుసని కొత్తగా మీరొచ్చి సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు.

## కామ్రేడ్స్‌తో కాంగ్రెస్ సీట్ల ఫైనలైజేషన్‌కు మరికొంత సమయం

### 30 లేదా 31న ఫైనలయ్యే అవకాశం

### చెరో రెండు సీట్లు ఇవ్వనున్న కాంగ్రెస్

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తులు చివరి దశకు చేరుకున్నప్పటికీ.. ఫైనల్ కావడానికి మరికొంత సమయం పట్టనుంది. సీపీఎం, సీపీఐకి చెరి రెండు సీట్లను ఇవ్వనున్న కాంగ్రెస్ వాటి ఫైనలైజేషన్‌లో తర్జనభర్జన పడుతున్నాయి. చివరాఖరిగా ఈ నెల 30 లేదా 31న ఏ ఏ సీట్లు అనేది తేలనుంది. సీపీఐకి చెన్నూరు, కొత్తగూడెం సీట్లను కేటాయించారు. అయితే సీపీఐ వారు ప్రథమ ప్రయారిటీలో మునుగోడు, హుస్నాబాద్, బెల్లంపల్లి సీట్లను కేటాయించాలని కోరారు. అయితే వాటిలో బెల్లంపల్లి సీటును మొదటి లిస్టులోనే కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. సెకండ్ లిస్టులో మునుగోడు, హుస్నాబాద్ సీట్లను కేటాయించారు. దీంతో సీపీఐకి కాంగ్రెస్ కేటాయించిన చెన్నూరు, కొత్తగూడెం సీట్లకు అంగీకరించే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. సీపీఎంకు మిర్యాలగూడ సీటును కేటాయించడానికి కాంగ్రెస్‌కు ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే మరో సీటు దగ్గరనే పీటముడి పడింది. సీపీఎం ప్రథమ ప్రయారిటీలో ఖమ్మం జిల్లాలో తమ ప్రభావం, ఉద్యమం బలంగా ఉందని కాబట్టి ఒక సీటు తప్పకుండా ఇవ్వాలని కోరింది. అందులో ప్రథమ ప్రయారిటీలో భద్రాచలం, పాలేరు, మధిర సీట్లను కోరింది. వాటిలో మొదటి లిస్టులోనే భద్రాచలం, మధిర సీట్లను కాంగ్రెస్ కేటాయించింది. రెండో జాబితాలో పాలేరుకు అభ్యర్థిని ప్రకటించింది. దీంతో సీపీఎం కోరిన సీటు కాకుండా వైరాను సీపీఎంకు కేటాయించడానికి కాంగ్రెస్ సంసిద్ధతతో ఉన్నప్పటికీ సీపీఎం ఆ సీటును తీసుకోవడానికి సిద్ధంగా లేదు. దీంతో రెండో సీటుపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ సీటుపై స్పష్టత కోసం కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం, సీపీఎం కేంద్ర నాయకత్వంతో మాట్లాడినట్టు తెలుస్తోంది.

## రెండు బల్బులకు రూ.99,500 కరెంటు బిల్లు!

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని చెబుతున్న విద్యుత్ శాఖ అధికారులు తప్పుడు బిల్లులకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పేదల ఇంటికి కూడా వేలు, లక్షలాది రూపాయలు బిల్లులు వస్తున్నా వాటిని పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే భారీగా పెరిగిన కరెంటు బిల్లులకు తోడు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తప్పుడు బిల్లులతో సమాన్యులు లారెత్తుతున్నారు. తరచూ తప్పుడు బిల్లులు వస్తున్నా అధికారులు వాటిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ఇదే తప్పుడు బిల్లులతో పేదలు, సామాన్యులను లారెత్తిస్తున్నారు. రాష్ట్రంలోని సిద్ధిపేట్ జిల్లా ధూలిమిట్ట మండల కేంద్రానికి చెందిన ఒక వృద్ధునికి ఈ నెలలో 99,464 రూపాయల మేర భారీగా విద్యుత్ బిల్లుఉ వచ్చింది. బిల్లును చూసి షాక్ అయిన ఆ ఇంటి యజమాని ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది మాత్రం బిల్లు కట్టాల్సిందేనని స్పష్టం చేయడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ధూలిమిట్ట మండల కేంద్రంలోని గుంజె రాములు ఓ ఇంట్లో నివసిస్తున్నారు.

## ఖమ్మంలో అంబటికి నిరసన సెగలు

**ఖమ్మం, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్‌శాఖ మంత్రి అంబటి రాంబాబుకు జిల్లాలో వరుస చేదు అనుభవాలు ఎదురయ్యాయి. గురువారం రాత్రి సత్తుపల్లి వద్ద ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని లారీ ఢీకొనగా సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం ఖమ్మం చేరుకొని స్థానికంగా ఓ హోటల్‌లో బస చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులు ఆయన బస చేసిన గ్రాండ్ గాయత్రి హోటల్ వద్ద శుక్రవారం ఉదయం హల్ చల్ చేశారు. ఓ వ్యక్తి చేతిలో పెద్ద కర్రతో అంబటిపై దాడికి కూడా ప్రయత్నించబోయాడు. అంబటి రాంబాబు వ్యక్తిగత రక్షకులు, స్థానిక పోలీసులు ఆందోళనకారులను అదుపు చేసి మంత్రిని సురక్షితంగా పంపించివేశారు.

## ఎన్నికల విధుల్లో రెవెన్యూ యంత్రాంగం బిజీబిజీ

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల విధుల్లో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి రెవెన్యూ యంత్రాంగమంతా క్షేత్ర స్థాయిలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. జిల్లా కలెక్టర్లు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి రెవెన్యూ అధికారులకు ఆయా నియోజకవర్గాలలో ఎలాంటి విధులు నిర్వర్తించాలో ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో పోలింగ్ బూత్‌లు, ఎన్నికల జాబితా పరిశీలన వంటి పనులన్నీ పర్య వేక్షిస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా వృద్దులు, వికలాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు ఎన్నికల కమీషన్ అవకాశం కల్పించింది. వృద్దులు, వికలాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయడానికి ఇబ్బందులు పడుతుండటంతో వారికి ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియో గించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వృద్దులకు, వికలాంగులకు ఫారం 12డి అందజేసి సంతకాలు సేకరించి పోస్టల్‌బ్యాలెట్ కోసం ధరఖాస్తు చేయిస్తున్నారు. ఈనెల 31 వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి అవకాశం ఇవ్వడంతో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఫారం 6, 7దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది పరిశీలించి ఆమోదం చేస్తున్నారు. వీరికి రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫారం 12 డి అందజేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా, నోటిఫికేషన్ విడుద లైనప్పటి నుంచి రెవెన్యూ సిబ్బంది సేవలు మరింతగా అవసరం అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

## మరో ఇద్దరు అధికారులపై ఇసి బదలీ వేటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 27:** రాష్ట్రంలో ఎన్నికల వేడి ఊపందుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ ఖరారు సమయం సమీపిస్తున్న వేళ... రాష్ట్రానికి చెందిన మరో ఇద్దరు అఃల భారత సర్వీసు అధికారులపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. కరీంనగర్ జిల్లా కలెక్టర్ బి.గోపి, పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు బదిలీకి ఈసీ ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇద్దరు అధికారులను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే కింది అధికారులకు బాధ్యతలు అప్పగించాలని... అదే విధంగా జీఏడీ శాఖలో రిపోర్ట్ చేయాలని ఐఏఎస్ అధికారి గోపి, ఐపిఎస్ అధికారి సుబ్బారాయును సిఎస్ ఆదేశించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఇరువురు అధికారులను ఈసీ బదిలీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

## బాలలపై లైంగిక వేధింపులు, తీర్పుల ప్రభావంపై నేడు అధ్యయన నివేదిక విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త :** బాలలపై లైంగిక వేధింపుల కేసులు, తీర్పుల ప్రభావంపై అధ్యయన నివేదికను విడుదల చేయాలని హైకోర్టు నిర్ణయించింది. శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల మధ్య ఆన్‌లైన్‌లో ఈ నివేదిక విడుదల జరగనున్నది. జిల్లా ప్రధాన న్యాయాధికారులు, ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఎగైన్స్ట్ సెక్సువల్ అఫెన్సెస్ (పోస్కో) కోర్టుల న్యాయాధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సూచించారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్), హైకోర్టు సమన్వయంతో ఈ నివేదికను రూపొందించింది.

## జిఎస్టీపై తెలంగాణ సర్కార్‌కు సుప్రీంలో చుక్కెదురు

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** జీఎస్టీ విషయమై తెలంగాణ సర్కార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత వ్యాట్ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన సవరణలను ధర్మాసనం కొట్టివేసింది. 101వ రాజ్యాంగ సవరణలోని సెక్షన్ 19 ప్రకారం జీఎస్టీ చట్టం అమల్లోకి రాకముందు రాష్ట్రాల్లో ఉన్న వస్తు, సేవల చట్టాలు సంవత్సరం పాటు కొనసాగడానికి వీలుంది. ఆ నిబంధనను ఆధారంగా చేసుకుని తెలంగాణ ప్రభుత్వం ఆ ఏడాది ముగియడానికి 13 రోజుల ముందు ఆర్డినెన్స్ ద్వారా అప్పటి వరకూ అమల్లో ఉన్న వ్యాట్ చట్టాన్ని సవరిస్తూ లిమిటేషన్ పీరియడ్‌ను పొడిగించడంతో అసెస్‌మెంట్లను తిరిగి తెరవడానికి అవకాశం కల్పించారు. దానిపై అసెంబ్లీలో చట్టం చేసేంత వరకూ ఆ ఆర్డినెన్స్ కొనసాగింది. అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో వ్యాట్ సరవణ చట్టం 2017 డిసెంబరు 2వ తేదీన అమల్లోకి వచ్చింది.

## ముగిసిన డిఎస్‌సి ఫీజు చెల్లింపు గడువు

### దరఖాస్తుల స్వీకరణకు నేడు ఆఖరు

**హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థాని సంస్థల పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నవంబర్‌లో నిర్వహించనున్న డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ(డీఎస్‌సీ)కి దరఖాస్తుకు పేమెంట్ చెల్లించడానికి గడువు శుక్రవారంతో ముగిసింది. దరఖాస్తులను అప్‌లోడ్ చేయడానికి నేడు(శనివారం) తుది గడువు. డీఎస్సీ దరఖాస్తులకు గడువు ఈ నెల 20తోనే ముగిసినప్పటికీ.. మరో వారం రోజులపాటు పెంచుతూ ఈ నెల 20న పాఠశాల విద్య శాఖ ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఫీజు పేమెంట్ గడువు ముగిసే నాటికి 1,76,599 మంది పేమెంట్ చేయగా.. వారిలో 1,71,564 మంది దరఖాస్తు చేసినట్లు అధికారులు తెలిపారు. నవంబర్ 30న తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉన్నందున నవంబర్ 20 నుంచి 30 వరకు నిర్వహించాలని నిర్ణయించిన పరీక్షలను వాయిదా వేసిన విషయం తెలిసిందే.

## కెసిఆర్ మళ్లీ సిఎం కాకపోతే.. రాష్ట్రం మరో అమరావతి అవుతుంది

### హరీశ్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన సోమశేఖర్‌రెడ్డి, బిత్తిరి సత్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 27:** ఎన్నికల్లో కాంగ్రెస్ రన్ ఔట్, బిజెపి డక్ ఔట్ కావడం ఖాయమని, కెసిఆర్ సెంచరీ కొడతారని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. దక్షిణ భారత దేశంలో హ్యాట్రిక్ సిఎంగా కెసిఆర్ రికార్డ్ కొట్టబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాకపోతే... రాష్ట్రం మరో అమరావతి అవుతుందని పేర్కొన్నారు.

టిపిసిసి మాజీ సెక్రటరీ సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ సింగిరె డ్డి శిరీష, రవికుమార్ ముది రాజ్(బిత్తిరి సత్తి) పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం సాయంత్రం వారందరికీ తెలంగాణ భవన్‌లో గులాబీ కండువా కప్పి బిఆర్ఎస్‌లోకి మంత్రి హరీశ్‌రావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే మాటలు, ముఠాలు, మంటలు అని విమర్శిం చారు. రాష్ట్రంలో బలమైన నాయక త్వం ఉండాలా, బలహీనమైన నాయకత్వం ఉండాలా అని ప్రశ్నించారు. ఇటువైపు బలమైన కెసిఆర్ ఉన్నడు, అవతలివైపు ఎవరు ఉన్నారని ప్రశ్నించారు. ఎవరు ఎన్ని ట్రిక్కులు చేసినా హాట్రిక్ కొట్టేది కెసిఆర్ అన్ని స్పష్టం చేశారు.

## రేవంత్‌రెడ్డి ఎప్పుడు జైలుకెళతాడో తెలియదు

### కాంగ్రెస్, బిజెపి నాయకులకు కళ్లు కనిపిస్తలేవు

### సిరిసిల్లలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

**సిరిసిల్ల, అక్టోబరు 27, ప్రభాతవార్త:** ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ రెడ్డి ఎప్పుడు జైలుకు పోతడో తెలువదని ఆయన ఎన్నికల గ్యారంటీలు ఇస్తున్నాడని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామరావు ఆరోపించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్లలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో కెటిఆర్ మాట్లాడుతూ ఎన్నికలో డబ్బులు పంచుతూ దొరికిన రేవంత్ రెడ్డి ఏ క్షణంలోనైనా జైలుకు వెళ్ళవచ్చని తెలిపారు. డబ్బులు పంచుతూ దొరికిన రేవంత్ రెడ్డి ఎన్నికల గ్యారంటీని ఎవరు నమ్మరని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని పాతర వేస్తారన్న పుడే అనివార్య పరిస్థితుల్లో దిక్కులేక విద్యార్థుల బలిదానాలతో ఆనాడు తెలంగాణ రాష్ట్రం వచ్చిందితప్ప మర్యాదాగా ఇవ్వలేదన్నారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని 11 సార్లు అవకాశం ఇస్తే దగా చేశారని మండిపడ్డారు. బిజెపి 2014లో మోడి జన్‌దన్ ఖాతాల్లో 15 లక్షలు వేస్తానని చెప్పి ఇప్పటి వరకు వేయలేదని విమర్శించారు. తొమ్మిదిన్నర సంవత్సారాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూడలనుకున్న వారికి కనిపిస్తుందని కాంగ్రెస్, బిజెపి నాయకులకు కండ్లు కనిపించడం లేదంటూ కెటిఆర్ ధ్వజమెత్తారు. గతంలో సిరిసిల్లకు ఇప్పటి సిరిసిల్లకు తేడాను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ యువకులకు కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు అందరు సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌లోనే అభివృద్ధి జరిగిందం టుండగా సిరిసిల్ల నాయకులకు మాత్రం కనిపించడం లేదని ఆరోపించారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్, బిజెపి వాళ్లకు కనిపించడం లేదంటూ మండిపడ్డారు. కేవలం ఎన్నికల సమయంలో ఓట్లు దండుకోవడానికే కుల, మతాలు పేరుతో ముందుకు వస్తున్నారని విమర్శించారు. కులం మతం కాదు గుణం పని చేసిన వారిని చూసి ఓట్లు వేయాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. అభివృద్ధి నా కులం..సంక్షేమం నా మతం అని పెర్కోన్నారు.

## తెలంగాణలో పోటీకి గతంకంటే పరిస్థితులు మెరుగు

### ఎపి టిడిపి అధ్యక్షుడిని కలిసిన తెలంగాణ టిడిపి నేతల బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 27:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలుగుదేశం పార్టీ నేతలు అప్రమత్తం అవుతున్నారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి జైలులో నిర్బంధించడంతో తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పోటీ చేసే విషయంలో సందిగ్దత నెలకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం పలువురు తెలంగాణ టిడిపి నేతలు జాతీయ నాయకత్వాన్ని కలిశారు. ఈ మేరకు పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నాయకుల బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడును కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బరిలో నిలబడటానికి గతంలో కంటే సానుకూల పరిస్థితులు ఉన్నాయని పార్టీ అగ్రనేతలకు వారు వివరించారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీకి సంబంధించిన అంశాలను పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారు.

## లక్ష్మీబరాజ్ నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేవు

- త్వరలో బరాజ్ పునరుద్ధరణ పనులు చేపడతాం
- బరాజ్ కుంగుబాటు ఘటనపై రజత్‌కుమార్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 27:** లక్ష్మీ బరాజ్ పునరుద్దరణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నామని సాగునీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ వెల్లడించారు. బరాజ్ నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లోపాలు,డిజైన్ లోపాలు లేవని, ఇసుక కదలికల వల్లే బరాజ్‌లోని 7వ బ్లాక్‌లోని పిల్లర్లు స్వల్పంగా కుంగాయని ఆయన స్పష్టం చేశారు. లక్ష్మీ బరాజ్ కుంగుబాటు ఘటనపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో శుక్రవారం రజత్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బరాజ్ కుంగుబాటుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై కూలంకషంగా చర్చించారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు. సమావేశం అనంతరం రజత్‌కుమార్ మాట్లాడుతూ... ఇసుక కదలికల వల్లే లక్ష్మీ బరాజ్ కుంగుబాటుకు గురైందని, నిర్మాణ లోపాలు గానీ,డిజైన్‌లో లోపాలుగానీ,నిర్వహణ లోపాలుగానీ లేవని స్పష్టం చేశారు. ఇన్వెస్టిగేషన్ అనంతరం వాటికి అనుగుణంగా నివేదికలను రూపొందించుకుని బరాజ్ పునరుద్దరణ పనులను కూడా వెంటనే ప్రారంభిస్తామని రజత్‌కుమార్ వివరించారు. సమావేశంలో ఈఎన్సీ మురళీధర్, రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుచ ఓ అండ్ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌పై సౌతాఫ్రికా విజయం

## ఉత్కంఠ పోరులో ఒక్కవికెట్ తేడాతో గెలుపొందిన సఫారీ జట్టు

## గెలిపించిన భారత సంతతి ఆటగాడు కేశవ్ మహారాజ్




**చెన్నై :** వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్ కథ ముగిసింది. ప్రపంచకప్ సెమీస్‌రేసులో నిలవాలంటే తప్పకుండా గెలవాల్సిన మ్యాచ్‌లో బాబర్ అజమ్ సారథ్యంలోని పాకిస్థాన్‌జట్టు ..దక్షిణాఫ్రికా చేతిలో ఓడి ఎక్కడో మిణుకుమిణుకుమంటున్న సెమీస్ ఆశలను కోల్పోయింది. శుక్రవారం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ బ్యాటింగ్‌లో తబడ్డా మిడిలార్డర్ రాణించడంతో సౌతాఫ్రికా ఎదుట 271 పరుగుల లక్ష్యాన్ని నిలిపిన బాబర్ సేన..ఆఖరి వరకు పోరాడినా ఫలితం తమకు అనుకూలంగా దక్కలేదు. లక్ష్యాన్ని సఫారీలు 47.2 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి ఛేదించారు. ఎయిడెడ్ మార్క్‌రమ్ (93 బంతుల్లో 91) మరో కీలకఇన్నింగ్ ఆడి సౌతాఫ్రికాకు టోరిలో ఐదో గెలుపు అందించాడు. ఆఖర్లో గెలిచేందుకు అవకావం వచ్చినా పాకిస్థాన్ దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. దీంతో దక్షిణాఫ్రికా పాయింట్ల పట్టికలో భారత్‌ను వెనకకు నెట్టి అగ్రస్థానంలో నిలవగా ఆడిన ఆరుమ్యాచ్‌లలో నాలుగింటిని ఓడిన పాకిస్థాన్ సెమీస్ అశలను వదులుకుంది. పాక్ నిర్దేశించిన 271 పరుగుల ఛేదనలో సఫారీలు ఆరంభం నుంచే ధాటిగా ఆడారు. షహీన్‌షా అఫ్రిదీ వేసిన తొలి ఓవర్లలోనే వరుసగా నాలుగు బౌండరీలు బాదిన క్వింటాన్ డికాక్ (24) ఎక్కువసేపు క్రీజ్‌లో నిలవలేకపోయాడు. దక్షిణాఫ్రికా సారథి బవుమా (28) కూడా ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. వన్‌డౌన్‌లో వచ్చిన డసెన్ (21)తోపాటు ఈటోర్నీలో భీకర ఫామ్‌లో ఉన్న హెన్రిచ్ క్లాసెన్ (12) లు నిరాశపరిచారు.

**మార్క్‌రమ్ కీలక ఇన్నింగ్స్..**

డసెన్, క్లాసెన్‌లు విఫలమైనా ఎయిడెన్ మార్క్‌రమ్.. డేవిడ్ మిల్లర్ (33బంతుల్లో 29, 2ఫోర్లు ,2సిక్స్‌లు ), మార్కో జాన్సన్ (14బంతుల్లో 20, 2ఫోర్లు 1సిక్స్)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నిర్మించి పాకిస్థాన్‌కు ఎలాంటి అవకాశం లేకుండా చేశారు. మిడిల్ ఆర్డర్‌లో మిల్లర్ ..మార్క్‌రమ్‌కు అండదగా నిలిస్తే ఆఖర్లో జాన్సెన్ ధాటిగా ఆడాడు. స్పిన్‌కు అనుకూలించే చెపాక్‌పిచ్‌పై మహ్మద్ నవాజ్, ఉసామా మిర్, ఇఫ్తికార్ అహ్మద్ వంటి స్పిన్నర్లను ప్రయోగించినా ఫలితం లేకుండా పోయింది. హారిస్‌రౌఫ్ పెద్దగా ప్రభావం చూప లేదు. మిల్లర్‌తో కలిసి ఐదో వికెట్‌కు 69బంతుల్లో 70 పరుగులు జోడించిన మార్క్‌రమ్ ..జాన్సెన్‌తో 29 బంతుల్లో 22 పరుగులు జోడించాడు. 50బంతుల్లో అర్థ సెంచరీ పూర్తి చేసుకున్న మార్క్‌రమ్ వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించాడు.

ఆఖర్లో దక్షిణాఫ్రికా విజయానికి 21పరుగుల దూరంలో మార్క్‌రమ్‌ను 40వ ఓవర్ 2వబంతికి ఉసామా మిర్ ఔట్ చేసి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. ఆమరుసటి ఓవర్లలో షహీన్ అఫ్రిదీ ..గెరాల్డ్ కొయెట్జ్ (10)ఉన ఔట్ చేయడంతో మ్యాచ్ మరింత రసవత్తరం అయ్యింది. మిర్‌తోపాటు అఫ్రిదీకూడా ఆఖర్లో కట్టడి చేశారు. హారీష్ రౌఫ్ వేసిన 46 ఓవర్లో మూడోబంతికి లుంగి ఎంగిడి (14 బంతుల్లో 4) అతడికే క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. చివరి వరుస బ్యాటర్ తబ్రేజ్ షంషీ (4నాటౌట్), కేశవ్ మహారాజ్ (21 బంతుల్లో 7 నాటౌట్,1ఫోర్)లు ఒత్తిడి తట్టుకుని సఫారీలకు విజయాన్ని అందించారు.

కాగా ఈపరాజయంతో పాకిస్థాన్ వరల్డ్ కప్ రేసునుంచి నిష్క్రమించినట్లే ..ఒకవేళ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతోపాటు శ్రీలంకలు తాము తర్వాత ఆడబోయే మ్యాచ్‌లలో దారుణాతి దారుణంగా ఓడితే తప్పా పాకిస్థాన్ సెమీస్‌కు చేరడం అసంభవం.




# 2024 ఐపిఎల్ వేలం సందడి


## డిసెంబర్ 19న దుబాయ్‌లో జరిగే అవకాశం

**న్యూఢిల్లీ:** క్రికెట్ అభిమానులు ఇప్పుడు వన్డే ప్రపంచకప్‌ను ఆస్వాధిస్తున్నారు..ఈక్రమంలోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్ 2024) వచ్చే ఏడాది ఈవెంట్‌కు సంబంధించి ఆసక్తికరమైన సమాచారం బయటకువచ్చింది. పిటిఐ కథనాల ప్రకారం ఐపిఎల్ 2024 సీజన్ మెగా వేలం డిసెంబర్ 19న దుబాయ్ వేధికగా జరిగే అవకాశం ఉందని తెలుస్తుంది. అంతేకాకుండా వచ్చే ఎడిషన్ కోసం ఫ్రాంఛైజీలు వెచ్చించే సొమ్ము కూడా మరికొంత పెరిగే అవకాశం ఉందని ఐపిఎల్ వర్గాలు తెలిపారు. "పదిజట్లు పాల్గొనే వేలానికి సంబంధించిన ప్రక్రియ నిర్వాహణ చాలా క్లిష్టమైంది. ఒకే చోట వందల సంఖ్యలో హోటల్ గదులు, సదుపాయాలు కల్పించడం కష్టమైన విషయం బిసిసిఐ అధికారులు, ఫ్రాంఛైజీలకు సంబంధించిన ప్రతినిధుల, బ్రాడ్‌కాస్ట్ సిబ్బంది ..ఇలా చాలామంది ఉంటారు. అందుకే దుబాయ్‌ను వేదికగా ఎంపిక చేయడం జరుగుతుంది. గతేడాది ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు ప్రతి ఫ్రాంఛైజీకి.రూ.95కోట్ల వరకు ఉండేవి. ఇప్పుడు ఆసొమ్మును మరో రూ.5కోట్లకు పెంచేందుకు అలోచన చేస్తున్నాం. అంటే 2024 సీజన్ కోసం నిర్వహించే వేలంలో ఫ్రాంఛైజీలు రూ.100కోట్ల వరకు తమ సొమ్మును వెచ్చించేందుకు అవకాశం దక్కనుంది "అని ఐపిఎల్ వర్గాలు వెల్లడించాయి.

# హెచ్‌సిఎ నిధుల గోల్‌మాల్ కేసులో అజారుద్దీన్ బెయిల్ పిటిషన్



**హైదరాబాద్:** హెచ్‌సిఏ నిధుల గోల్‌మాల్ కేసులో హెచ్‌సిఏ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. టెండర్ల పేరుతో థర్డ్‌పార్టీకి నిధులు కట్టబెట్టారని అజారుద్దీన్‌పై ఉప్పల్ పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి అజారుద్దీన్ అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఉప్పల్ స్టేడియంలో జిమ్, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్లు, క్రికెట్‌బాల్స్, బకెట్ చైర్స్ కొనుగోళ్లలో నిధుల గోల్‌మాల్ జరిగిందని ఆరోపిస్తూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అజారుద్దీన్ , విజయానంద్, సురేందర్‌తోపాటు మరికొందరిపై ఐపిసి సెక్షన్ 406, 409, 420, 465, 467, 471 20బి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈనేపథ్యంలో ఉప్పల్ పోలీసులు నమోదు చేసిన కేసులో మందస్తు బెయిల్ ఇవ్వాలని మల్కాజ్‌గిరి కోర్టులో పిటిషన్ వేయగా ఈపిటిషన్‌పై నవంబర్ 1న కోర్టు విచారణ చేయనుంది.



# కోహ్లీ ఎనర్జీకి అదే కారణం

## సీక్రెట్ బయటపెట్టిన లీలాప్యాలెస్ ఛెఫ్ అన్సుమాన్ బాలీ

**న్యూఢిల్లీ:** పరుగుల రారాజు విరాట్ కోహ్లీ ఈసారి ప్రంకచకప్‌లో సూపర్ ఫాంలో ఉన్నాడు. అదేసమయంలో ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు అదనపు శ్రద్ద పెట్టాడు. దీంతో ఆయన ఫిట్‌నెస్‌పై చర్చ జరుగుతుంది. ఈనేపథ్యంలో ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ ప్రత్యేక డైట్ ఫాలో అవుతున్న విషయాన్ని టీంఇండియా బసచేస్తున్న లీలా హోటల్ ఛెఫ్ అన్సుమాన్ బాలీ వెల్లడించారు. విరాట్ ప్రస్తుతం మాంసాహారం తినడం లేదు. ఎక్కువగా ఉడకబెట్టిన ఆహారం తినేందుకు ఇష్టపడుతున్నాడట. కాయగూరలతో చేసిన డిమ్‌సుమ్ అనే చైనీస్ డిష్‌తోపాటు ప్రొటీన్ కోసం మాక్‌మీట్, టోపువంటివి తింటున్నాడు. ఒక వీలైనంత తక్కువగా పాలపదార్థాలను కోహ్లీ తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక టీంఇండియా రాగి దోశను అత్యంత ఇష్టంగా తింటోదని ఆయన తెలిపారు. తమ హోటల్‌లో చిరుదాన్యాలతో చేసిన ఇడ్లీలు, క్వినోవాతో చేసిన ఇడ్లీలు అందుబాటులో ఉంచామని ఇవి మంచి ప్రోటీన్ అందించే ఆహారాలని అటగాళ్లకు తెలుసని పేర్కొన్నారు.


# రిల్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా అంబానీ వారసులు..

**ముంబై, అక్టోబరు 27:** రిలయన్స్ ఇండస్ట్రీస్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఇషా అంబానీ, ఆకాష్ అంబానీ అనంత్ అంబానీల నియామకానికి సంబంధించిన తీర్మానాలను దాని వాటాదారులు ఆమోదించారు. 'అక్టోబరు 26, 2023న అవసరమైన దానికంటే ఎక్కువ మెజారిటీతో ఈ తీర్మానాలు ఆమోదించారని' అని రిల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. పోలైన మొత్తం ఓట్లలో ఇషా అంబానీ, ఆకాష్ అంబానీ, అనంత్ అంబానీ వరుసగా 98.21శాతం, 98.06శాతం, 92.76శాతం వచ్చాయి. ఇషా, ఆకాష్, అనంత్‌ల నియామకాలకు ఆగస్టులో డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఇది రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో నాయకత్వ మార్పులో పెద్ద అడుగుగా నిలిచింది. మరో కీలక నిర్ణయంలో నీతా అంబానీ రాజీనామాను డైరెక్టర్ల బోర్డు ఆమోదించింది. ఇషా, ఆకాష్, అనంత్‌లను క్రమంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లో వివిధ వ్యాపారాలకు అధిపతిగా ప్రోత్సహిస్తున్నారు. డిసెంబర్ 2021 లో ముఖేష్ అంబానీ రిల్‌లో నాయకత్వ మార్పుపై మాట్లాడారు. 'తదుపరి తరం నాయకులుగా ఆకాష్,ఇషా, అనంత్ లు రిలయన్స్‌నిమరింత ఉన్నత శిఖరాలకు నడిపిస్తారనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు' అని ముఖేష్ చెప్పాడు. ఇషా అంబానీ గ్రూప్ రిటైల్ వెంచర్ రిలయన్స్ రిటైల్‌కు నాయకత్వం వహిస్తున్నారు. జులైలో, ఇషా అంబానీ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్‌గా కూడా పేరుపెట్టారు. రిలయన్స్‌జియో ఇన్ఫోకామ్ డైరెక్టర్ల బోర్డు ఛైర్మన్‌గా గతేడాది జులైలో ఆకాష్ నియమితుల య్యారు. అతను జియో ప్లాట్‌ఫారమ్‌ల బోర్డు సభ్యుడు కూడా. డేటా కొత్త టెక్నాలజీల వినియోగంవైపు నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. '5జి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కొత్త యుగం సాంకేతికతలను ప్రభావితం చేసే ఉత్పత్తులు, సేవల సృష్టికి నాయకత్వం వహిస్తాడు' అని రిలయన్స్ ఒక ప్రకటన పేర్కొంది. అనంత్ మార్చి 2020 నుంచి జియో ప్లాట్‌ఫారమ్‌లు, మే 2022 నుంచి రిలయన్స్ రిటైల్ వెంచర్స్, జూన్ 2021 నుంచి రిలయన్స్ న్యూ ఎనర్జీ, రిలయన్స్ న్యూ సోలార్ ఎనర్జీ బోర్డులలో డైరెక్టర్‌గా ఉన్నారు.




# అదానీ గ్రూప్‌లో వాటాలు తగ్గించుకున్న ఎఫ్‌పిఐలు

**ముంబై, అక్టోబరు 27:** విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్‌పిఐ)లు సెప్టెంబరు 2023 త్రైమాసికంలో అనేక అదానీ గ్రూప్ కంపెనీలలో తమ వాటాను తగ్గించుకున్నారు. ఇది దేశీయ ఇన్వెస్టర్లను కొంత ఆందోళనకు గురిచేస్తున్న అంశం. మొత్తం ఆదానీకి సంబంధించిన 10 లిస్టెడ్ కంపెనీల్లో ఇదే ధోరణిని మార్కెట్ నిపుణులు గమనించారు. ముఖ్యంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ త్రైమాసిక ప్రాతిపదికన విదేశీ హోల్డింగ్‌లలో అతిపెద్ద క్షీణతను చవిచూసింది. జులై-సెప్టెంబర్ 2023 త్రైమాసికంలో విదేశీ పెట్టుబడిదారులు అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో తమ వాటాను 4.8శాతం మేర తగ్గించుకున్నారు. సెప్టెంబరు 30, 2023 వరకు అందుబాటులోని సమాచారం ప్రకారం అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల వాటా జూన్ త్రైమాసికంలో 19.34శాతం నుంచి 14.52శాతానికి తగ్గిపోయింది. ఇక మిగిలిన గ్రూప్ కంపెనీలను పరిశీలిస్తే, అదానీ పోర్ట్స్‌లో పెట్టుబడులు 13.8శాతానికి తగ్గాయి. ఇవి జూన్ త్రైమాసికంలో 16.99 శాతంగా ఉంది. అంటే 3.16 శాతం వాటాల విక్రయం నమోదైంది. సిమెంట్ కంపెనీ ఎసిసిలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా కూడా దాదాపు 3శాతం తగ్గి సెప్టెంబర్ 30 చివరి నాటికి 7.1శాతానికి చేరుకుంది. జనవరిలో హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిన తర్వాత మార్చి త్రైమాసికం నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఈ క్రమంలో అదానీ పోర్ట్స్, ఎసిసి, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ విల్మార్, అదానీ టోటల్ గ్యాస్‌లలో విదేశీ పెట్టుబడిదారుల వాటా క్షీణిస్తోంది. అలాగే సెప్టెంబర్ త్రైమాసికంలో అదానీ పవర్, ఎన్‌డిటివి మినహా అన్ని గ్రూప్ కంపెనీల్లో విదేశీ పెట్టుబడిదారుల వాటాలు వరుసగా తగ్గుతూ వస్తున్నాయి.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, అక్టోబరు 27:** ఆరు రోజుల వరుస నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం పుంజుకున్నాయి. ఉదయమే సానుకూలంగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు రోజంతా అదే జోరును కొనసాగించాయి. ఏ దశలోనూ మార్కెట్లకు అమ్మకాల సెగ తగల్లేదు. కార్పొరేట్ ఫలితాలు సానుకూలంగా ఉండడం కలిసొచ్చింది. ఉదయం సెన్సెక్స్ 63,559.32 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై చివరికి 634.65 పాయింట్లు పెరిగి 63,782.80 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 190పాయింట్లు పెరిగి 19,047.25 పాయింట్ల వద్ద నిలిచింది.




డాలరుతో మార కంలో రూపాయి విలువ రూ.83.24 వద్ద నిలిచింది. ఏసియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, ఐటిసి వంటి షేర్లు మాత్రమే క్షీణించాయి. యాక్సిస్ బ్యాంకు, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, ఎస్‌బిఐ, ఎన్‌టిపిసి, టాటా మోటార్స్, నెస్లే ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టి, ఇండస్ ఇండ్ బ్యాంకు, సన్‌ఫార్మా, మారుతి సుజుకి వంటి షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. కమర్షియల్ ఇంజిన్ల తయారీ నిమిత్తం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, శాఫ్రన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. హెచ్ఎఎల్ షేరు 1.93 శాతం పెరిగి రూ.1,854.50 వద్ద ముగిసింది. మారుతి సుజుకి ఇండియా నికర లాభం 80.3శాతం పెరిగి రూ.3,716.5 కోట్లకు చేరింది. నికర విక్రయాల విలువ వార్షిక ప్రాతిపదికన రూ.28,543.50 కోట్ల నుంచి రూ.35,535.1 కోట్లకు చేరింది. షేరు విలువ శుక్రవారం 1.06శాతం పెరిగి రూ.10,535వద్ద నిలిచింది. జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఔషధ తయారీ సంస్థ సిప్లా ఏకీకృత ఆదాయం 14.41శాతం పెరిగి రూ.6,589.22 కోట్లకు చేరింది. ఏకీకృత పన్నుల తర్వాత లాభాలు 44.9శాతం పుంజుకొని రూ.1,155.37 కోట్లుగా నమోదైంది. కంపెనీ షేరు 2.19 శాతం పెరిగి రూ.1,176 వద్ద నిలిచింది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.625 కోట్ల నికర లాభాన్ని నివేదించింది. వార్షిక ప్రాతిపదికన 25శాతం వృద్ధి నమోదైంది.

# జియో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్..

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** భారత్‌లో తొలి ఉపగ్రహ ఆధారిత గిగా ఫైబర్ సర్వీస్‌ను విజయవంతంగా అమలు చేసినట్లు ప్రముఖ టెలికం సంస్థ రిలయన్స్ జియో ప్రకటించింది. భారత్‌లో ఇప్పటి వరకు ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతాలకు దీని ద్వారా వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించనున్నట్లు తెలిపింది. జియో స్పేస్ ఫైబర్‌గా పిలుస్తున్న ఈ సర్వీస్‌ను భారత మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమక్షంలో శుక్రవారం రిలయన్స్ జియో విజయవంతంగా ప్రదర్శించింది. జియో ఇప్పటికే భారత్‌లో 45 కోట్ల కస్టమర్లకు ఫిక్స్‌డ్ లైన్, వైర్‌లెస్ మార్గాల ద్వారా వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తోంది. దేశంలోని ప్రతి ఇంటికీ డిజిటల్ సేవలను చేరువ చేయడంలో భాగంగానే జియోఫైబర్, జియో ఎయిర్‌ఫైబర్ వంటి బ్రాడ్‌బ్యాండ్ సర్వీసుల సరసన జియో స్పేస్‌ఫైబర్‌ను కూడా చేర్చినట్లు కంపెనీ తెలిపింది. ఇప్పటికే ఎలాంటి జాప్యం లేని, వేగవంతమైన ఇంటర్నెట్‌ను, ఎంటర్‌టైన్‌మెంట్ సేవలను ప్రాంతంతో సంబంధం లేకుండా అందిస్తున్నట్లు పేర్కొంది. తాజా శాటిలైట్ నెట్‌వర్క్‌తో జియో ట్రూ 5జి సేవలు కూడా దేశంలోని ప్రతి ప్రాంతానికి అందుతాయని వివరించింది. ప్రపంచంలో తాజా 'మీడియం ఎర్త్ ఆర్బిట్' శాటిలైట్ టెక్నాలజీ కోసం జియో ఎస్ఇఎస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు జియో తెలిపింది. గిగాబిట్, స్పేస్ నుంచి ఫైబర్ తరహా సేవలను అందించగల ఎంఇఒ ఉపగ్రహాల కూర్పు ఇదొక్కటేనని పేర్కొంది. తద్వారా జియోకు ఎస్ఇఎస్‌కు చెందిన ఒ3బి, ఒ3బి ఎంపవర్ శాటిలైట్ల నెట్‌వర్క్‌ను యాక్సెస్ లభిస్తుందని తెలిపింది.



## వాణిజ్యం

దీంతో దేశవ్యాప్తంగా అత్యంత కచ్చితత్వంతో ఈ అత్యాధునిక సాంకేతికతతో బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తున్న ఏకైక సంస్థగా జియో నిలుస్తుందని పేర్కొంది. జియోస్పేస్ ఫైబర్ సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ఇప్పటికే నెట్‌వర్క్‌లో గుజరాత్ గిర్, ఛత్తీస్‌గఢ్, కోర్బా, ఒడిశా నవరంగాపూర్, అసోం ఒఎన్‌జిసి జోర్హాట్ వంటి మారుమూల ప్రాంతాలనుచేర్చినట్లు జియో తెలిపింది. 'భారత్‌లో లక్షలాది ఇళ్లు, వ్యాపారాలకు జియో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించాం. ఇప్పటివరకుఇంటర్నెట్ అనుసంధానతకు దూరంగా ఉన్న లక్షలాది మందికి కూడా జియోస్పేస్ ఫైబర్‌ద్వారా సేవలనువిస్తరిస్తున్నాం. జియోస్పేస్ ఫైబర్‌తో ఎవరైనా, ఎక్కడి నుంచైనా కొత్త డిజిటల్ సమాజంలో చేరి గిగాబిట్ యాక్సెస్‌తో ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ, విద్య, ఆరోగ్య, వినోదాత్మక సేవలను పొందొచ్'ని ఆకాశ్‌అన్నారు.

# వన్‌వెబ్ శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు: సునీల్ మిట్టల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 27:** వన్ వెబ్ శాటిలైట్ కమ్యూ నికేషన్ సేవలు వచ్చే నెల దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయని భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిట్టల్ తెలిపారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతేడాది 5జి సేవలను ఎయిర్‌టెల్ ప్రారంభించిందని, ఇప్పటి వరకు 5వేల నగరాలు, పట్టణాలు, 20వేల గ్రామాల్లో సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవల గురించి మిట్టల్ మాట్లాడారు. వన్‌వెబ్ ప్రపంచంతోపాటు దేశానికిసేవలు అందించడానికి సిద్ధమైందని సునీల్ మిట్టల్ తెలిపారు. దీని ద్వారా దేశంలో ఏ మారుమూల ప్రదేశంలోనైనా, ఎవరైనా ఈ సేవలు పొందొచ్చని చెప్పారు. వచ్చేనెల నుంచి ఈసేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన వన్‌వెబ్ లండన్‌కు చెందిన యూటెల్ శాట్ కంపెనీలో విలీనం అయింది. విలీన సంస్థలో ఎయిర్‌టెల్ 21.2శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగాఉంది. భూ సమీప కక్ష్యలోలోని 618 శాటి లైట్ల ద్వారా వన్‌వబ్ ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు అందించనుంది. దేశవ్యాప్తంగా 5జి సేవల ప్రారంభం, 4జి విస్తరణ కోసం పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆదిత్యా బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లాచెప్పారు. మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ఈ మేరకు ఆయన మాట్లాడారు.

# అధిక రిస్క్ ఫండ్ ప్రారంభించాలని కోరిన సెబి!

**ముంబై, అక్టోబరు 27:** కేపిటల్ మార్కెట్ రెగ్యులేటర్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) అధిక రిస్క్‌తో కూడిన కొత్త మ్యూచువల్ ఫండ్‌ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. ఇది అధిక రాబడిని పొందే అవకాశాన్ని అందిస్తుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియాకు సెబి లేఖ రాసింది. సెబి మొదట ఎఎంఎఫ్ఐతో జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. చాలా మంది పెట్టుబడిదారులు-అధిక రాబడిని సంపాదించే రేసులో అధిక రిస్క్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కి లేదా కొన్ని సార్లు నమోదు కాని సలహాదారుల వద్దకు వెళుతున్నారని సెబి ఆందోళన వ్యక్తం చేసింది. స్టాక్స్ వంటి సాధనాల్లో పెట్టుబడి పెట్టడానికి అనుమతించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. రూ.45 లక్షల కోట్ల భారతీయ ఎంఎఫ్ పరిశ్రమలో ఇప్పుడు ఈ కొత్త కేటగిరీ ఎలా ఉంటుందో -లేదో ఎలా ఉండాలో అనే దానిపై చర్చలు మొదలయ్యాయి. అటువంటి పథకాలు డిఫాల్ట్ అయితే లేదా వారి అధిక రిస్క్ వ్యూహాల కారణంగా చాలా డబ్బును పోగొట్టుకుంటే, ఫండ్ హౌస్ బ్రాండ్ మాత్రమే కాకుండా 'మొత్తం ఎంఎఫ్ పరిశ్రమపై కూడా' ప్రభావం చూపుతుందని వారు భయపడుతున్నారు. చిన్న పెట్టుబడిదారులు అధిక రిస్క్ వ్యూహాల ద్వారా లాగబడకుండా చూసుకోవడానికి, సెబి ఈ కొత్త కేటగిరీ ప్రతిపాదన నెరవేరితే అధిక కనిష్ట పెట్టుబడి అవరోధాన్ని కలిగి ఉండాలని ప్రతిపాదించింది.

ఇలా కాకుండా మ్యూచువల్ ఫండ్స్ అధిక రిస్క్ ఉత్పత్తిని ప్రారంభించినట్లయితే, పెట్టుబడిదారులు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టే అవకాశం ఎక్కువగా ఉంటుందని సెబి పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఫండ్ పెట్టుబడి పెట్టగల సాధనాలను సెబి పేర్కొనలేదు. 'విషయాలు ఇంకా సంప్రదింపుల దశలో ఉన్నాయి' అని ఈ అధికారి తెలిపారు. కానీ ఎంఎఫ్ పరిశ్రమ అధికారులు, అటువంటి పథకం మొమెంటం




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.